TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

బుధవారం, సెప్టెంబర్ 23, 2026 | సంపుటి - 20 | సంచిక 352 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

మూడు రాష్ట్రాల్లో 12 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 12 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించి ంది. వీటిలో యూపీలో 10, ఉత్తరా ఖండ్‌లో ఒక స్థానానికి ద్వైవార్షిక ఎన్నికలు, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. ఎన్నికల నోటిఫికేషన్ సెప్టెంబర్ 29న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 వరకు గడువు విధించారు. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన, 9న ఉపసంహరణకు గడువు ముగుస్తుంది. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

తరువాయి 2లో

ఆయుర్వేద ఆసుపత్రుల అభివృద్ధికి భారీగా నిధులు

గుంటూరు జీజీహెచ్‌లో జన్యు పరీక్షల కేంద్రం : సత్యకుమార్

అమరావతి : ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రులు, డిస్పెన్సరీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఆయుష్ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆరు జిల్లాల్లో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు రూ.27 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. విశాఖ ఆయుష్ ఆసుపత్రిలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2.61 కోట్లు, విశాఖ, కాకినాడ ఆయుష్ ఆసుపత్రుల నిర్వహణకు రూ.1.50 కోట్ల చొప్పున నిధులు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 334 ఆయుర్వేద డిస్పెన్సరీలు, 40 కేంద్రాలకు ఉచిత మందులు

తరువాయి 2లో

క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో

విధులు నిర్వర్తించాలి

ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత

అమరావతి : పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వం అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తల్లిదండ్రుల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకుని ప్రజలకు సేవ చేయాలని నూతనంగా విధుల్లోకి అడుగుపెడుతున్న కానిస్టేబుళ్లకు సూచించారు. పోలీసు యూనిఫాం ప్రజల్లో భయాన్ని కాకుండా భరోసాను కల్పించేలా ఉండాలని అన్నారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ బీటీసీ పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం 2025?26 బ్యాచ్‌కు చెందిన 149 మంది స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి అనిత శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాష్ట్రంలో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను ఎన్నో అడ్డంకులను అధిగమించి పూర్తి చేశామని తెలిపారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్ల స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 శిక్షణ కేంద్రాల్లో 5,800 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తయిందని తెలిపారు. వీరిలో 2,330 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో సుమారు

తరువాయి 2లో

దళితులు, గిరిజనులకు

భరోసా

ప్రభుత్వ పథకాలు.. కార్యక్రమాల్లో పెద్దపీట

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ బాధితులకు సత్వర న్యాయం

హైలెవెల్ కమిటీ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, ఎస్సీ ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం--1989 అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ముఖ్యమంత్రి సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతో పాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రమంగా అయిదేండ్లలో ఎస్సీ ఎస్టీలపై అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల మీటింగ్ లు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు.

2లో

కాంగ్రెస్ బీఆర్ఎస్

కుమ్మక్కయ్యారు

ప్రజలను డైవర్ట్ చేస్తున్నారు

మీ రాజకీయ డ్రామాలు ఆపండి : ఎంపి ఈటల

హైదరాబాద్ : కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కయ్యారని ఎంపి ఈటల రాజేందర్ ఆరోపించారు. మిమ్మల్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. పంటలు ఎండడం చూస్తుంటే పల్లె పల్లెల పల్లేర్లు మొలిచాయి అనే పాట గుర్తుకు వస్తుంది. ఈ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుంది, పోయేకాలం వచ్చింది. గోదావరిలో నీళ్లు పారుతున్నప్పుడు ఎత్తి పోయకుండా కాంగ్రెస్ తెచ్చిన కరువు ఇదని అన్నారు. ఒకపక్క నీళ్లు లేక మరోపక్క కరెంటు కోతలతో పంటలు ఎండుతుంటే.. రోమ్ నగరం తగలబడుతుంటే పిడేలు వహించినట్లు ఉంది రేవంత్ రెడ్డి వ్యవహారం. జూరాల నీళ్లు ఇవ్వాలని వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రతిపక్ష నేతలను నిర్బంధించడం ఆపి రైతులకు నీళ్లు, కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా.

తరువాయి 2లో

కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

దసరాకు ముందే పంపిణీ!

హైదరాబాద్ : తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను

ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలను

సహించేది లేదు

- దళితుడికి కావాల్సింది ఆత్మగౌరవం.. సమానత్వం.. భద్రత!
- బాధితులకు పరిహారం కోసం 'గ్రీన్ ఛానల్'
- బడ్జెట్‌తో ముడిపెట్టకుండా సత్వరమే నిధుల విడుదల
- 2023 నుంచి ఇప్పటివరకు 7,563 అట్రాసిటీ కేసులు నమోదు
- కేసుల దర్యాప్తు నుంచి పునరావాసం వరకు సీఎం ఆరా
- పదేళ్లలో ఒక్క రాష్ట్రస్థాయి విజిలెన్స్ సమావేశమూ ఎందుకు పెట్టలేదు?
- గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

హైదరాబాద్ : దళితులు, గిరిజనులకు కావాల్సింది కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదని.. ఆత్మగౌరవం, సమానత్వం, భద్రత అత్యంత ముఖ్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలను ప్రభుత్వం కేవలం కేసుల సంఖ్యగా చూడడం లేదని, బాధిత కుటుంబాల వేదనను మానవీయ కోణంలో పరిశీలిస్తూ వారికి సత్వర న్యాయం, పరిహారం, పునరావాసం

2లో

మూడు రాష్ట్రాల్లో 12 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్టు ఈసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. యూపీలో నవంబర్ 25తో ముగియనున్న 10 మంది రాజ్యసభ సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీరిలో బిజెపికి చెందిన అరుణ్‌సింగ్, గీతా శాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బీఎల్ వర్మ, సీమా ద్వివేది, హర్దీప్‌సింగ్ పురి ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్‌గోపాల్ యాదవ్, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన రామ్‌జీ గౌతమ్ పదవీకాలం కూడా ముగియనుంది. మాజీ ఉపముఖ్యమంత్రి దినేశ్ శర్మ రాజీనామాతో మరో రాజ్యసభ స్థానం సెప్టెంబర్ 11 నుంచి ఖాళీగా ఉంది. అండమాన్-నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆయన రాజీనామా అమల్లోకి వచ్చింది. ప్రస్తుత అసెంబ్లీ బలాబలాల ప్రకారం యూపీలో బిజెపి నేతృత్వంలోని కూటమి 8 స్థానాలు, సమాజ్‌వాదీ పార్టీ 2 స్థానాలు గెలుచుకునే అవకాశముందని రాజకీయ లెక్కలు సూచిస్తున్నాయి. దీంతో బీఎస్పీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చు. మరిన్ని కనుగొనండి జిల్లా వార్తల కవరేజ్ తాజా వార్తలు సేవ ఇ-పేపర్ యాక్సెస్ ఇక ఉత్తరాఖండ్‌లో బిజెపి సభ్యుడు నరేశ్ బన్సాల్ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఆ ఒక్క స్థానానికి ఎన్నిక జరగనుంది.మరోవైపు పశ్చిమ బెంగాల్‌లో నటులు కోయెల్ మల్లిక్‌గా ప్రసిద్ధి చెందిన రుక్మిణి మల్లిక్ జూలై 16న రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికైన సభ్యులు 2032 ఏప్రిల్ 2 వరకు మిగిలిన పదవీకాలాన్ని కొనసాగిస్తారు.

క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వర్తించాలి

1,000 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉండటం విశేషమన్నారు.ప్రజలకు పోలీసులంటే భరోసా కలగాలిపోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. విపత్తులు, బందోబస్తు, అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ అందించామని తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, వారికి సత్వర న్యాయం అందించేలా పనిచేయాలని సూచించారు. పోలీసులంటే ప్రజల్లో భయం కాకుండా భరోసా కలిగేలా వ్యవహరించాలన్నారు. రాజ్యాంగానికి అనుగుణంగా విధులురాజ్యాంగానికి అనుగుణంగా రాగద్వేషాలకు అతీతంగా నీతి, నిజాయితీ, కర్తవ్య స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని హోంమంత్రి అనిత దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన 2047 విజన్‌లో కానిస్టేబుళ్లు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పదవీ విరమణ వరకు క్రమశిక్షణతో, ప్రశాంతంగా ప్రజలకు సేవలందిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని నూతన కానిస్టేబుళ్లకు హోంమంత్రి అనిత సూచించారు.

రామాయంపేట నియోజకవర్గాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్

రామాయంపేట : మెదక్ జిల్లా రామాయంపేట గతంలో అభివృద్ధిలో దూసుకుపోతున్న నియోజకవర్గం గత డెలిమిటేషన్‌లో రద్దు కావడం వల్ల ప్రాంతానికి తీరని నష్టం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా గౌరవాధ్యక్షులు మెట్టు గంగారం అన్నారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం డెలిమిటేషన్ ప్రక్రియను చేపట్టనున్న నేపథ్యంలో రద్దయిన రామాయంపేట నియోజకవర్గాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.రామాయంపేటను నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేసి రామాయంపేట శంకరంపేట,నిజాంపేట,నార్సింగి, చేగుంట మండలాలను కలిపి నూతన రామాయంపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.ఈ డిమాండ్ ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు అనుగుణమైనదేనని ఇది గొంతెమ్మ కోరిక కాదని స్పష్టం చేశారు.1952 నుంచి 2009 వరకు రామాయంపేట నియోజకవర్గంగా కొనసాగిందని అనంతరం డెలిమిటేషన్‌లో నియోజకవర్గాన్ని రద్దు చేయడంతో రామాయంపేట ప్రాంతం రాజకీయంగా పరిపాలనాపరంగా నష్టపోయిందని పేర్కొన్నారు.రామాయంపేటను తిరిగి అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలంటే నియోజకవర్గాన్ని పునరుద్ధరించడం అవసరమన్నారు.రామాయంపేట నియోజకవర్గ పునరుద్ధరణ కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎంతటి త్యాగానికైనా తాము సిద్ధంగా ఉంటామని,ప్రజల హక్కు కోసం పోరాటం చేస్తూ వెనుకడుగు వేసేది లేదని తెలిపారు.అన్ని రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు,కులమతాలకు అతీతంగా ఏకమై రామాయంపేట నియోజకవర్గ పునరుద్ధరణ కోసం భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములై ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

సింగిల్ విండో అనుమతులు కోసం యత్నాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 22,: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , నూతన హెచ్‌ఎండీఏ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ ప్రక్రియను మరింత సరళతరం చేయాలని రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముఖ అసోసియేషన్లు ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నాయి. ప్రస్తుతం వివిధ విభాగాల నుంచి ఎన్‌ఓసీలు పొందడంలో జరుగుతున్న జాప్యం, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రాజెక్ట్‌ల నిర్మాణం ఆలస్యమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో అక్రమాలను అరికడుతూ, పూర్తి పారదర్శకతతో కూడిన సేవలు అందించేందుకు ఒక సమగ్ర సింగిల్ విండో వ్యవస్థను తక్షణమే అమల్లోకి తేవాలని డిమాండ్ చేస్తూ వస్తున్నాయి.ప్రస్తుతం అమల్లో ఉన్న ఆన్‌లైన్ అనుమతుల విధానం కొన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా అనేక సాంకేతిక , అధికారిక ఇబ్బందులు వేధిస్తున్నట్లు డెవలపర్లు వాపోతున్నారు. ఫైళ్లు వివిధ శాఖల చుట్టూ తిరగడం వల్ల వడ్డీ భారం పెరిగి, చివరికి అది ఇళ్ల కొనుగోలుదారులపై అదనపు ఆర్థిక భారంగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అన్ని రకాల క్లియరెన్స్‌లను ఒకే గొడుగు కిందకు తెచ్చే సరికొత్త సింగిల్ విండో విధానం అత్యవసరమని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.ఈ ప్రతిపాదిత సింగిల్ విండో వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్న నిర్దిష్ట కాలపరిమితిలోగా అన్ని అనుమతులు మంజూరయ్యేలా నిబంధనలు రూపొందించాలని కోరుతున్నారు. ఫైర్ సేఫ్టీ, రెవెన్యూ, అటవీ, పర్యావరణం , స్థానిక పట్టణాభివృద్ధి సంస్థల నుంచి వేర్వేరుగా అనుమతులు తెచ్చుకునే నరకయాతన తప్పుతుందని, దీనివల్ల చిన్న , మధ్యతరగతి బిల్డర్లకు ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొంటున్నారు. పారదర్శకత పెరిగితే ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు వినియోగదారులకు కూడా సరసమైన ధరల్లో గృహాలు లభించే అవకాశం ఉంటుందని వాదిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం, సంబంధిత పురపాలక శాఖ ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఊతమిచ్చేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. అంతర్జా తీయ స్థాయిలో హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ వేగంగా మారుతున్న తరుణ ంలో, మౌలిక సదుపాయాల కల్పనలో , అనుమతుల జారీలో ఈ రకమైన ఆధుని క సంస్కరణలు ఎంతైనా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కనుక సింగిల్ విండో విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తే, దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద ఇన్వెస్టర్లు మరెన్నో ప్రాజెక్ట్‌లతో భాగ్యనగరం వైపు క్యూ కట్టే అవకాశం ఉంది.

దళితులు, గిరిజనులకు భరోసా

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలన్నారు. అట్రాసిటీ ఘటనల్లో బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని, వారికి సకాలంలో నష్టపరిహారం, సహాయం, పునరావాసం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించి, బాధిత కుటుబాలకు సత్వర న్యాయం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రతి ప్రభుత్వ పథకం, కార్యక్రమంలో వారికి తగినంత ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. దళితులు, గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటినుంచో సొంత బిడ్డల్లా ఆదరించిందని, అందుకే పల్లెపల్లెనా ఇప్పటికీ ఇందిరమ్మను తలుచుకుంటున్నారని చెప్పారు. పేదలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు అందించిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీదని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే.. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్ధిదారులు ఎస్‌సీలే ఉన్నారన్నారు. ఎస్టీల జనాభా 10 శాతం ఉంటే, వారికి 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని వివరించారు. రాష్ట్రంలోని 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, దీనివల్ల దళితులు, గిరిజనులు, ఆదివాసీలు సహా పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనం అందుతోందన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. చదువు ఒక్కటే జీవితాలను మారుస్తుందని.. విద్యతోనే సమాజంలో అసమానతలకు, అణిచివేత రుగ్మతలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పిల్లలను చదువుతో పాటు క్రీడలవైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం మీది. మీ సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలను సహించేది లేదు

అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం-1989 అమలు, కేసుల దర్యాప్తు, బాధితులకు పరిహారం తదితర అంశాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రస్థాయి ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించిన నేపథ్యంలో మంత్రి లక్ష్మణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న సమావేశం జరిగిన తర్వాత రాష్ట్రస్థాయిలో ఈ స్థాయి సమీక్ష జరగడం ఇదే తొలిసారి. తెలంగాణ ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈ కమిటీ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుందని ఆయన పేర్కొన్నారు. 7,563 అట్రాసిటీ కేసులు.. 2023 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 7,563 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనట్లు మంత్రి తెలిపారు. నమోదైన కేసులు ఏ దశలో ఉన్నాయి? ఎన్ని కేసుల్లో దర్యాప్తు పూర్తయింది? న్యాయస్థానాల్లో విచారణ పరిస్థితి ఏమిటి? బాధితులకు ఎంత మేర ఆర్థిక సహాయం అందింది? పునరావాస చర్యలు ఎలా సాగుతున్నాయి? తదితర అంశాలపై ముఖ్యమంత్రి అధికారులను స్వయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. కేసు నమోదు చేయడంతో ప్రభుత్వ బాధ్యత ముగిసిపోదని, బాధితులకు న్యాయం అందే వరకు వ్యవస్థ పనిచేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. పరిహారానికి 'గ్రీన్ ఛానల్' అట్రాసిటీ కేసుల్లో బాధితులకు చెల్లించాల్సిన పరిహారం నిధుల కొరత లేదా బడ్జెట్ విడుదల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానల్ విధానంలో సత్వరమే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. బాధిత కుటుంబం ఇప్పటికే తీవ్ర వేదనలో ఉంటుందని, పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నది ప్రభుత్వ అభిప్రాయమన్నారు. ప్రత్యేక కోర్టుల పనితీరుపైనా సమీక్ష ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాల పనితీరు, మొబైల్ కోర్టుల పరిస్థితి, కేసుల విచారణలో జాప్యం తదితర అంశాలపైనా సమావేశంలో చర్చించినట్లు మంత్రి తెలిపారు. అట్రాసిటీ నిరోధక చట్టంపై ప్రజల్లోనే కాకుండా అమలు చేసే వ్యవస్థల్లోనూ మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే అంశంపైనా సమీక్ష జరిగినట్లు చెప్పారు. 'పదేళ్లలో సమావేశం ఎందుకు పెట్టలేదు?' గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా మంత్రి లక్ష్మణ్‌కుమార్ విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్--మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదో గత పాలకులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులపై దాడులు, వేధింపులు, అత్యాచారాలకు సంబంధించిన అంశాల్లో గత ప్రభుత్వం అవసరమైన స్థాయిలో శ్రద్ధ చూపలేదని మంత్రి ఆరోపించారు. ఇవి మంత్రి చేసిన రాజకీయ విమర్శలని పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం అట్రాసిటీ నిరోధక చట్టం అమలును మరింత పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టిందని ఆయన తెలిపారు. ఇటీవల దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన ఘటనపై కూడా మంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఘటనకు సంబంధించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునే అంశంపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లోనూ ఎర్రవల్లి వద్ద జరిగిన 'శుద్ధి' ఘటనపై లక్ష్మణ్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేయగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. 'చదువొక్కటే జీవితాలను మార్చగలదు' అట్టడుగు వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో శాశ్వత మార్పు రావాలంటే విద్యే ప్రధాన మార్గమని మంత్రి స్పష్టం చేశారు. "చదువొక్కటే జీవితాలను మార్చగలదు. అట్టడుగు వర్గాల పిల్లలను చదువు వైపు నడిపించాలి" అని పిలుపునిచ్చారు. చదువుతో పాటు విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రతి నెల మొదటి వారంలోనే మెస్, కాస్మొటిక్ ఛార్జీలు అందేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లు, విద్యాసంస్థల నిర్వహణపై ప్రభుత్వం ఇటీవల కూడా ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించింది. ఇందిరమ్మ స్ఫూర్తితో సంక్షేమం ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీదని చెప్పారు. జనాభా దామాషా ప్రకారం సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం దళితులకు, 17 శాతం ఎస్టీలకు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని, అలాగే 3.48 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ గణాంకాలు మంత్రి ప్రెస్‌మీట్‌లో వెల్లడించినవిగా పేర్కొనడం సముచితం. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని మంత్రి అన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వంతో పాటు సమాజం మొత్తానికి బాధ్యతగా ఉండాలని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీల భద్రత, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, అభివృద్ధి అంశాల్లో అందరూ కలిసి పనిచేయాలని కోరారు. "ఈ ప్రభుత్వం మీది.. మీ కోసం పనిచేస్తుంది" అని ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు మంత్రి లక్ష్మణ్‌కుమార్ భరోసా ఇచ్చారు.

ఆయుర్వేద ఆసుపత్రుల అభివృద్ధికి భారీగా నిధులు

అందించనున్నట్లు తెలిపారు. డిస్పెన్సరీల ఆధునీకీకరణకు మొత్తం రూ.46.23 కోట్లు కేటాయించామని సత్యకుమార్ చెప్పారు. 150 డిస్పెన్సరీల పనులు పూర్తి చేసేందుకు రూ.28.41 కోట్లు, 64 డిస్పెన్సరీల పునర్నిర్మాణం, డిజిటల్ నెట్‌వర్కింగ్‌కు రూ.12.80 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 55 పంచకర్మ ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలకు కూడా నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, కీళ్ల వ్యాధుల చికిత్స కోసం 26 కేంద్రాలకు రూ.2.05 కోట్లు, వయోమిత్ర కార్యక్రమానికి రూ.62.40 లక్షలు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. 8,400 పాఠశాలల్లో ఆయుర్ విద్య కార్యక్రమానికి రూ.6.50 కోట్లు, గర్భిణులు, నవజాత శిశువుల కోసం సుప్రజ కార్యక్రమానికి రూ.8.50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. కాకినాడ ఆయుర్వేద కళాశాల అభివృద్ధికి రూ.4.10 కోట్లు, ధర్మవరం నూతన ఆయుర్వేద కళాశాలకు రూ.3.71 కోట్లు, విజయవాడలోని ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఆధునీకీకరణకు రూ.3 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జీజీహెచ్)లో క్యాన్సర్ రోగుల కోసం సమగ్ర జన్యు పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా ఇలాంటి అధునాతన జన్యు పరీక్షలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో తొలి దశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు జన్యు పరీక్షలు నిర్వహించనున్నారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి, రోగికి సరైన చికిత్స అందించేందుకు జన్యు పరీక్షలు ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. క్యాన్సర్ నివారణ, చికిత్సపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కర్నూలులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.120 కోట్లతో క్యాన్సర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా విషయంలో ఎలాంటి అవినీతి జరగలేదని సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆధారాలు ఉంటే కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో పరీక్ష లేకుండానే ఉద్యోగాలు ఇచ్చేందుకు చట్టంలో నిబంధనలు ఉన్నాయన్నారు. చట్ట ప్రకారమే డీఎస్సీ నియామకాలు జరిగాయని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి కేవలం తన అస్తిత్వాన్ని చాటుకునేందుకే డీఎస్సీ అవినీతి పేరుతో రోడ్డెక్కారని మంత్రి విమర్శించారు. లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు పూర్తయిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద దాడులకు పాల్పడిన వారినే పోలీసులు అరెస్టు చేస్తున్నారని మంత్రి వెల్లడించారు.

గోదావరి నది తీరం వద్ద, రాయికల్ గణేశ్ నిమజ్జన ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎస్పీ

జగిత్యాల : గణేశ్ నిమజ్జననీ శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సజావుగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. ఈ రోజు జిల్లా ఎస్పి అశోక్ కుమార్ తో కలిసి గణేష్ నిమజ్జన ప్రాంతాలైన ధర్మపురి, రాయపట్నం గోదావరి నది తీరం, రాయికల్ వద్ద ఏర్పాట్ల పరిశీలన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్క నిర్వాహకులు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా శోభయాత్ర, నిమజ్జనం వేడుకలు చేసుకోవాలని కోరారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళికతో వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి కావలసిన, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ, మత్స్యశాఖ, అధికారులు సేవలు అందించాలని, నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేయించాలని, భారీ క్రేన్లు, చిన్న క్రెన్ లు, గజ ఈతగాళ్ళు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ వాసులతో పాటు భక్తులు, పిల్లలు తరలివచ్చే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనం వేడుకలు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ.... వినాయక నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా పూర్తి కావడానికి పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. నిమర్జనం అంతయు ప్రశాంత వాతావరణం లో పూర్తి అయ్యేలా అవసరమైన ప్రాంతాలలో సిసి కెమెరాలను, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని, స్థానిక గజ ఈతగాళ్లు ను నిమర్జన ప్రాంతములో అందుబాటులో ఉంచమని, శోభాయాత్ర వెళ్ళేమార్గం లో ఇతర శాఖ ల యొక్క సమన్వయము తో ఎటువంటి అవాంతరములు తలెత్తకుండా పటిష్టమైన చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా డీజే లు, సౌండ్ సిస్టంలు,బాణాసంచా కాల్చడం వంటివి చేయరాదని తెలిపారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, చట్టానికి లోబడి నడుచుకోవాలని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ బీఆర్ఎస్ కుమ్మక్కయ్యారు

బిఆర్ఎస్ వారి ఆస్తుల మీద విచారణకు మూడేళ్లుగా ఏం చేశారు. రేవంత్ నీకు నిజాయితీ లేదు. 23 లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని చెప్తున్న మీరు ఇన్నాళ్లు ఏం చేశారు ? ఫోన్ ట్యాపింగ్ కేసు, ఫార్ములా వన్ కేసులు ఏమయ్యాయి. ఫాం హౌస్ ల డ్రామాలు పక్కన పెట్టి ప్రజలకు నీళ్లు కరెంటు ఇవ్వాలి. బీజేపీ మాత్రమే ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది. కాంగ్రెస్ కి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది బీజేపీనే. మూసీ, 22 ఏ మీద పోరాటం చేయడానికి ఎతీబ కి ముఖం లేదు. హైడ్రా, మూసీ, 22 ఏ, ఫీజు రీఎంబర్స్మెంట్, ఉద్యోగాలు, పంటలకు నీళ్ల కోసం పోరాటం చేస్తున్న పార్టీ బీజేపీ. ఇకనైనా రెండు పార్టీల డ్రామాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవాలని అన్నారు.

కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులకు పూర్తి స్థాయిలో పెన్షన్లు అందజేయాలని మంత్రి సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

51జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

రాష్ట్రీయ హరిత గౌరవ పురస్కారానికి ఎంపికైన బాల ప్రకృతి ప్రేమికుడు

- అవార్డు కోసం వెళ్లే ఖర్చుతో మొక్కలు నాటుతా..

అవార్డులు కాదు పచ్చదనమే పెంచడమే ముఖ్యం-

తెలంగాణ బాల ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్

కొత్తగూడెం : పర్యావరణ పరిరక్షణలో తనదైన ముద్ర వేస్తూ, చిన్న వయసులోనే పెద్ద లక్ష్యంతో ముందుకు సాగుతున్న తెలంగాణ బాల ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్ కు అరుదైన జాతీయ గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మక "రాష్ట్రీయ హరిత గౌరవ పురస్కార్ 2026" కు ఎంపికయ్యాడు. రాజస్థాన్ కేంద్రంగా 40 ఏళ్లుగా పర్యావరణ సేవలో తలమునకలై, కోట్లాది మొక్కలు నాటి "ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియా" గా పేరుగాంచిన శ్రీ విష్ణు లాంబా ఆధ్వర్యంలోని కల్పతరు సంస్థాన్ ఈ అవార్డులను అందజేస్తోంది. ఈ నెల 27వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జైపూర్ లోని కనోరియా పీజీ మహిళా మహావిద్యాలయ ఆడిటోరియం, జెఎల్ఎన్ మార్గ్ లో జరిగే "పర్యావరణ మహాకుంభ్" కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి ఎంపికైన 25 మంది ప్రకృతి ప్రేమికులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు, కేంద్ర మంత్రులు, ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు.గతంలో ఈ పురస్కారాన్ని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ అందుకోవడం విశేషం. ఈ పురస్కారాన్ని ఆ రాష్ట్ర గవర్నర్ హరిబావు భాగ్డే చేతుల మీదుగా అందుకున్నారు అవార్డు కార్యక్రమంలో గతంలో మరో గవర్నర్ కల్రాజ్ మిశ్రా పాల్గొని అవార్డులు ప్రధానం చేశారు అటువంటి ప్రతిష్టాత్మక జాబితాలో చిన్నారి విశ్వామిత్ర చౌహాన్ చోటు దక్కించుకోవడం తెలంగాణకు గర్వకారణం.అయితే ఈ సందర్భంగా విశ్వామిత్ర చౌహాన్ చూపిన నిబద్ధత అందరినీ ఆలోచింపజేస్తోంది. జైపూర్ వెళ్లి రావడానికి ప్రయాణ ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని, ఆ ఖర్చుతో అవార్డు కోసం వెళ్లడం కంటే, ఆ డబ్బులతో అన్ని మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుతానని తనకు అవార్డులు, రివార్డులు ముఖ్యం కాదని, పచ్చదనం పెంచడమే తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశాడు. అవార్డు కంటే ఆలోచన గొప్పదన్న ఈ బాలుడి మాట నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం. అయినప్పటికీ నిర్వాహకులు విశ్వామిత్ర కోసం ప్రత్యేకంగా ప్రయాణ ఖర్చులు తాము భరించి ఆహ్వానించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.చిన్న వయసులోనే పెద్ద ఆలోచనలతో, భావి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించాలనే తపనతో ముందుకు సాగుతున్న విశ్వామిత్ర చౌహాన్ కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టా భూమిలో టేకు చెట్లు అక్రమ నరికివేత

కోరుకొండ : బొల్లెత్తుపాలెం - కోటి కేశవరం మధ్యలోని పట్టా భూమిలో ఏకంగా 48 టేకు చెట్లు అక్రమంగా నరికివేతకు గురయ్యాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా చెట్లను నరికి తరలించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.కోరుకొండకు చెందిన సామిల్ మిల్లు నిర్వాహకులే ఎటువంటి అనుమతులు లేకుండా ఈ చెట్లను తరలించారన్న సమాచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పట్టా భూమిలో ఉన్నా సరే టేకు చెట్ల నరికివేతకు వాల్టా చట్టం ప్రకారం అటవీ, రెవెన్యూ శాఖల అనుమతి తప్పనిసరి. అయితే ఈ ఘటనలో ఎటువంటి అనుమతులు తీసుకోలేదని తెలుస్తోంది.

సింగరేణిలో మెటీరియల్ కొరతతో కార్మికుల భద్రతను పణంగా పెట్టొద్దు

డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు, రెజిన్ క్యాప్సిల్స్, సేఫ్టీ షూస్ వెంటనే సరఫరా చేయాలి

బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల భద్రతపైన ఉండాలి

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే జి.ఎం. కార్యాలయాలను ముట్టడిస్తాం

ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ హెచ్చరిక

గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్)సింగరేణిలో కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ, వారికి అవసరమైన కీలక మెటీరియల్స్‌ను సకాలంలో అందించడంలో యాజమాన్యం విఫలమవుతోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-1 ఇంక్లైన్, జీడీకే-2వ ఇంక్లైన్, జీడీకే-11వ ఇంక్లైన్ లలో జరిగిన వినతి పత్రాల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో మెటీరియల్ కొరత పేరుతో కార్మికుల భద్రతతో చెలగాటమాడితే సహించేది లేదని వారు స్పష్టం చేశారు. గనుల్లో పని చేయడానికి అవసరమైన ప్రాథమిక మెటీరియల్స్ కూడా సకాలంలో అందకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు గత కొన్ని నెలలుగా సకాలంలో అందకపోవడంతో గనుల్లో ఉత్పత్తి పనులకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో రీకండిషన్ డ్రిల్ బిట్లను ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు. సపోర్ట్ మెన్‌కు అత్యవసరంగా అవసరమైన రెజిన్ క్యాప్సిల్స్ ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రూఫ్ బోల్టింగ్‌కు అవసరమైన రెజిన్ క్యాప్సిల్స్ కొరత ఏర్పడితే గని భద్రతా చర్యలపై ప్రత్యక్ష ప్రభావం పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. లైన్‌మెన్‌కు అవసరమైన కీళ్లు తదితర సామగ్రిని వెంటనే సరఫరా చేయాలని, ట్రాక్ లైన్ల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగితే టబ్బులు పట్టాలు తప్పడం, కిందపడటం వంటి ప్రమాదాలకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్మికులకు జూన్, జూలై నెలల్లో అందాల్సిన సేఫ్టీ షూస్ సెప్టెంబర్ వచ్చినా ఇంకా అందకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని యాజమాన్యంపై మండిపడ్డారు. గ్లౌజెస్ నుంచి ఎస్.డి.ఎల్ ఆయిల్ వరకు అన్నింటిలో కొరతేనా అని ప్రశ్నించారు. కార్మికులకు అవసరమైన నాణ్యమైన గ్లౌజెస్, ఎస్.డి.ఎల్ లకు అవసరమైన నాణ్యమైన ఆయిల్, గిరిమీట్లు తదితర మెటీరియల్స్‌ను, అలాగే నూతన రంగుతో కూడిన ఒకే రకం యూనిఫామ్‌ను అన్ని గనుల్లో వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. "ఉత్పత్తి లక్ష్యాలు గుర్తుంటే, కార్మికుల భద్రత ఎందుకు గుర్తుండదు కార్మికుల నుంచి పని ఆశిస్తే.. పని చేయడానికి అవసరమైన మెటీరియల్స్ ఎందుకు ఇవ్వరు" అని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. కార్మికుల ప్రాణాలు, ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ ఏఐటీయూసీ సహించబోదని, ఆర్జీ-1 ఏరియాలోని అన్ని గనుల్లో కార్మికులకు అవసరమైన డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు, రెజిన్ క్యాప్సిల్స్, సేఫ్టీ షూస్, గ్లౌజెస్, ఎస్.డి.ఎల్ ఆయిల్, గిరిమీట్లు, ట్రాక్ మెటీరియల్స్, యూనిఫామ్ తదితర అవసరమైన సామగ్రిని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్మికుల హక్కులు, భద్రత, గౌరవప్రదమైన పని పరిస్థితుల విషయంలో ఏఐటీయూసీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో పై సమస్యల సాధన కోసం అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి ఆఫీస్ బేరర్స్ సంకె అశోక్, మాదన మహేష్, బోగ సతీష్ బాబు, ఎస్. వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, సుధాకర్, అన్ని గనుల పిట్ సెక్రటరీలు మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, నాయకులు గొడిశెల నరేశ్, పి. రవి, సాన జలపతి, చంద తిరుపతి, బి. సమ్మయ్య, మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఎండిపోయిన గోదావరి

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆందోళన

నిమజ్జనానికి నీళ్లు లేక భక్తుల ఇబ్బందులు

కన్నెపల్లి పంప్‌హౌస్, ఎల్లంపల్లి నీటిని వెంటనే విడుదల చేయాలని చందర్ డిమాండ్

గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : గోదావరి బ్రిడ్జ్ వద్ద రామగుండం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు కోరుకంటి చందర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లనే నేడు గోదావరి నది పూర్తిగా ఎండిపోయిందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా గోదావరి నదిని ఏడాది పొడవునా సముద్రాన్ని తలపించేలా నిండుకుండలా ఉంచారని కొనియాడారు. అపర భగీరథుడిలా కేసీఆర్ నీటిని అందించి మత్స్యకారులందరికీ జీవనోపాధి కల్పించారని గుర్తుచేశారు. కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గోదావరి ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వినాయక నిమజ్జనోత్సవాలు జరుగుతున్న వేళ, గోదావరిలో నీళ్లు లేకపోవడంతో విగ్రహాలను ఎక్కడ నిమజ్జనం చేయాలో తెలియక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై బిఆర్ఎస్ పార్టీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ఎల్లంపల్లిలో నిల్వ ఉన్న నీటిని వెంటనే గోదావరిలోకి విడుదల చేయాలని మరియు కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించాలని కోరారు.

విద్యార్థులకు యూనిఫార్మ్‌ల పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి

ధర్మపురి, సెప్టెంబర్ 22, (ది క్రైమ్ న్యూస్) : ధర్మపురి పట్టణంలోని ఎంపీపీఎస్ న్యూ హరిజన్‌వాడ, ధర్మపురి పాఠశాల మరియు అంగన్‌వాడి కేంద్రాలకు చెందిన మొత్తం 73 మంది విద్యార్థులకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం యూనిఫార్మ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి హాజరై విద్యార్థులకు యూనిఫార్మ్‌లను అందజేశారు. పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ, సేవాభావంతో సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ నిర్వాహకులను ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీకాంత్, కార్నెక్స్ మైక్రోసిస్టమ్స్, హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. సీతారామరావు, పాఠశాల హెచ్ఎం కనకతారావు, ఉపాధ్యాయులు హరీశ్, కవిత, సునీత, అంగన్‌వాడి ఉపాధ్యాయురాలు మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల్లో అన్నప్రసాద వితరణలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి

ధర్మపురి, సెప్టెంబర్ 22, (ది క్రైమ్ న్యూస్) : పట్టణంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు గణేష్ మండపాల వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రిమ్స్‌లో పెను విషాదం

ముగ్గురు చిన్నారుల పరిస్థితి విషమం

అదిలాబాద్ : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్సీయూ వార్డులో సోమవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ ఘటన కలకలం రేపింది. చిన్నారుల వార్డులో ఏసీ పేలిపోయింది. దాంతో వార్డు అంతటా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. భయాందోళనకు గురైన తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో 5 రోజుల శిశువు మృతి చెందగా మరో 24 మంది చిన్నారులను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అప్రమత్తయిన ఆసుపత్రి సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసారు. చిన్నారులను పక్క వార్డుకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా రాగిజావ పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి.

ధర్మపురి, సెప్టెంబర్ 22, (ది క్రైమ్ న్యూస్): ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ మరియు కేర్నెక్స్ మైక్రో సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిరోజూ ఉచితంగా రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ నిర్వాహకులు శ్రీ మధుసూదన్ సాయి, కేర్నెక్స్ మైక్రో సిస్టమ్స్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. సీతారామరాజు, పోషణ, విద్య, వైద్యం వంటి సేవా కార్యక్రమాల ద్వారా పేద కుటుంబాల పిల్లలు, విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులకు అవసరమైన పోషకాలు, విటమిన్లు అందించే రాగిజావను ఉచితంగా అందించడం ఎంతో ఉపయోగకరమని ఆమె తెలిపారు. స్వార్థం లేకుండా సేవాభావంతో ముందుకు వచ్చి విద్యార్థులకు అండగా నిలుస్తున్న మధుసూదన్ సాయి కి, కేర్నెక్స్ మైక్రో సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ సంస్థకు చైర్మన్ నాగలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు రాగిజావ వంటి పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉంటూ, విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ సంఘనబట్ల దినేష్, జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయురాలు, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ సర్కార్

విద్యార్థుల భవిష్యత్‌కు అండగా రేవంతన్న ప్రభుత్వం..

నాణ్యమైన విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణ అల్పాహార కార్యక్రమం..

70 కోట్లతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి..

రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ.చింతకుంట విజయరమణ రావు..

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సహకారంతో హరే రామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు గారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఉదయాన్నే వ్యవసాయ, ఇతర పనులకు వెళ్లిపోతుండటంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందించే విషయంలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. వారానికి ఆరు రోజుల పాటు ఇడ్లీ- సాంబార్, పూరీ- ఆలూ కుర్మా, దోస, ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ- సాంబార్, బోండా తదితర అల్పాహారం తోపాటు పాలు అందిస్తున్నట్లు వివరించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.70 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు తెలిపారు. కాంపౌండ్ వాల్స్, నూతన పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, భవనాల ఆధునీకరణతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి కూడా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, ఇప్పటికే పిల్లర్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఏడాది కాలంలో పనులు పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థు ల హాస్టళ్లను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసి, అందరికీ సమాన విద్య అందించే లా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులకు అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రానున్న కాలంలో ఓదెలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గర్రెపల్లి పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తుల కోరిక మేరకు ఓపెన్ జిమ్,వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు అలాగే గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ చైర్మన్,సింగిల్ విండో చైర్మన్ మరియు పలు గ్రామాల సర్పంచ్లు, ఉపసర్పంచ్లు మరియు గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు ప్రజాప్రతినిధులు మరియు ఉపాధ్యాయులు మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జన ఉత్సవాలు నిర్వహించాలి.

శాంతియుతంగా శోభాయాత్ర లు కొనసాగాలి.

భక్తులు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలి.

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.

జగిత్యాల, సెప్టెంబర్ 22, (ధర్మపురి, ది క్రైమ్ న్యూస్): భక్తి శ్రద్ధలతో పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ధర్మపురి పట్టణం లోని గోదావరి నది, రాయపట్నం గోదావరి వద్ద వినాయక నిమజ్జన వేడుకల కోసం మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక ఇతర శాఖల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, పట్టణ మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మీడియా తో మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్క నిర్వాహకులు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా శోభయాత్ర, నిమజ్జనం వేడుకలు చేసుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళికతో వేడుకలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి కావలసిన, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ, మత్స్యశాఖ, అధికారులు సేవలు అందించాలని, నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేయించాలని, భారీ క్రేన్లు, చిన్న క్రెన్ లు, గజ ఈతగాళ్ళు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పట్టణ వాసులతో పాటు భక్తులు, పిల్లలు తరలివచ్చే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనం వేడుకలు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలోజగిత్యాల ఆర్డీవో మధు సూదన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, డిఎస్పీ పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్ ఓసీపీ-టు ముంపు గ్రామంలో కలెక్టర్ పర్యటన

- భూనిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

రామగిరి,సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్):-ఆర్.జి -త్రీ పరిధిలోని ఓసీపీ-టు విస్తరణలో భాగంగా ముంపునకు గురికానున్న రాజాపూర్ గ్రామాన్ని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇళ్లు, భూములు కోల్పోతున్న భూనిర్వాసితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజాపూర్ గ్రామంలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. ముఖ్యంగా ఆర్పిఎన్ ఇళ్లకు, ఆర్టీహెచ్ ఇళ్లకు సమానంగా నష్టపరిహారం అందించాలని బాధితులు తమ ఆవేదనను కలెక్టర్‌కు వివరించారు. ఒక్కో కుటుంబం వద్ద నుంచి భూములు, ఇళ్లు, నష్టపరిహారానికి సంబంధించిన వివరాలను కలెక్టర్ స్వయంగా సేకరించారు.బాధితుల సమస్యలను విన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష.. అవసరమైతే మరోసారి అధికారులను గ్రామానికి పంపించి సమగ్రంగా సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తమ ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తగిన నష్టపరిహారం, పునరావాసం కల్పించిన తర్వాతే ముంపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కలెక్టర్ పర్యటనలో మంథని ఆర్డీఓ సురేష్, రామగిరి తహసీల్దార్ సుమన్,సింగరేణి జీఎం మధుసూదన్, ఎస్టేట్ ఆఫీసర్ ఐలయ్య, ఏసీపీ మడత రమేష్, మంథని సీఐ, స్వామి. రామగిరి ఎస్సై తాడవేనా శ్రీనివాస్, ముత్తారం ఎస్సై రవికుమార్,గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లెల సతీష్, వార్డు సభ్యులు కాల్వ రజిత శ్రీనివాస్, గ్రామ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పుల్లెల కిరణ్, కలవేన సదానందం వేల్పుల ఆంజనేయులు, కలవేన రమేష్, పుల్లెల మల్లయ్య, మాటేటి రాజబాబు, పాశం కొమురయ్య, పుల్లెల సుమన్, మాటేటి శ్రీనివాస్, కన్నూరి కుమార్, మంథని కుమార్, సంగే రాజయ్య, వేముల స్వరూప, కలవేన స్వరూప, కాలువ జ్యోతి. రాజాపూర్ గ్రామానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, భూనిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

సంపాదకీయం

స్వామినాథన్ సూచనలకు విలువేదీ?

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ శతజయంతి జరుపుకుంటున్న వేళ ఆయన సూచించిన అనేక విషయాలను మననం చేసుకుని,వాటిని అనుసరించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.దేశంలో వ్యవసాయం గుడ్డెద్దు చేల్లో పడ్డ చందంగా మారింది. విపరీతమైన రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతోంది. మనుషుల్లో రోగాలకు కారణం అవుతోంది. ఎరువులన్నీ మనుషుల్లో నిక్షిప్తం అయి కొత్త రోగాలను కొని తెచ్చుకుంటున్నాం. క్యాన్సర్ లాంటి వ్యాధులను ఆహ్వానిస్తున్నాం. ఈ క్రమంలో వ్యవసాయాన్ని సేంద్రియం వైపు మళ్లించాలి. అలాగే రైతులకు అసవరమైన సేంద్రియ పద్దతులను అందుబాటులోకి తీసుకుని రావాలి. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు హామీ ఇవ్వాలి. ప్రజలకు ఆహార ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకుని రావాలి. సేంద్రియ ఉత్పత్తులను విదేశాలకు విరివిగా ఎగుమతి చేసుకునేలా చేయాలి. ఇందుకు పాలకులు ప్రతినబూని పనులు చేపట్టాలి. వ్యవసాయాన్ని పండగ చేయాలంటే ఇవి మాత్రమే చేయాలి. అంతేగానీ కబుర్లు చెప్పడం మానాలి. దేశ ఆహార భద్రతకు కీలకమైన, వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రొఫెసర్ స్వామినాథన్ ఒకరు. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పిలుస్తున్నాం. కాని ఆయన తరచుగా వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతుల అభివృద్ధికి సూచించిన సలహాలను విస్మిరస్తూ వచ్చాం. జాతీయ రైతు కమిషన్ చైర్మన్‌గా స్వామినాథన్ ప్రభుత్వాల ముందుంచిన నివేదికలు చాలా విలువైనవి. వాటిని అమలు చేస్తామని అంటున్న పాలకులు వాటి జోలికి పోవడం లేదు. ఊకదంపుడు ఉపన్యాసాలు, రుణమాఫీలు,రైతుబంధు వంటి పథకాలతో మభ్యపెడు తున్నారు. ఆయన 2005-2006 సంవత్సరాల్లో ప్రభుత్వం ముందుంచిన సమగ్ర జాతీయ రైతు కమిషన్ నివేదికలు పాలకుల పక్షపాత వైఖరిని బహిర్గతం చేశాయి. అనేకమంది రైతులు తమ ఆందోళనలో తరచూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని కోరుతున్నారు. విచ్చలవిడి రసాయనాల వాడకం, యంత్రాల వినియోగం వలన జరుగుతున్న నష్టాల్ని 1968 సైన్స్ కాంగ్రెస్ స్థాయిలోనే వివరించారు. స్వామినాథన్ రాజ్యసభ సభ్యుడిగా మహిళా రైతుల హక్కుల గురించి, పటిష్ట వ్యవసాయ రంగ అభివృద్ధి గురించి, సమగ్ర భూ, రైతు రక్షణ అంశాలతో ముడిపడిన సంస్కరణల విషయాల్ని ప్రస్తావించారు. మహిళా రైతులకు భూ వనరు, ప్రభుత్వ పథకాల విస్తరణకు తగిన చట్టాల్ని ప్రవేశ పెట్టిన ఘనత స్వామినాథన్‌ది. వ్యవసాయ సాంకేతికాల విస్తరణ, ఉత్పత్తి పరంగా ప్రభుత్వ పాత్ర పెరగాలని, ప్రభుత్వేతర సంస్థల ద్వారా రైతులకివ్వబడే సాంకేతికాల పరంగా, నియంత్రణ జరగాలని చట్ట సభలో వ్యక్తపరిచారు. ముఖ్యంగా కృత్రిమ జన్యు మార్పిడి ద్వారా జరిగిన సాంకేతికాల్ని విశ్లేషించి, పరిశోధించకుండా విస్తరింప చేయ కూడదని చెప్పారు. స్వామినాథన్ తన 98 ఏళ్ల జీవితంలో అనేక వైవిధ్యమైన విజయాలను అందుకున్నారు. అదే సమయంలో అసంబద్ధ విమర్శలనూ ఎదుర్కొన్నారు. స్వామినాథన్ దేశ ముఖ్య ఆహార పంటలైన గోధుమ, వరి వంటి వ్యవసాయాల్ని మలుపు తిప్పారు. స్వామినాథన్ తన కుటుంబ నేపథ్యమైన వైద్య వృత్తిని చేపట్టకుండా కీలకమైన వ్యవసాయ రంగాన్ని ఎన్నుకోవటమే దేశీయ వ్యవసాయంపై ఆయనకున్న ఆసక్తిని గుర్తించాలి. వ్యవసాయ-జన్యు శాస్త్రవేత్తగా నైపుణ్యత పొందటమే గాకుండా దేశీయ వ్యవసాయానికి విలువైన సూచనలు చేశారు. ప్రఖ్యాత విదేశీ సంస్థల్లో, గుర్తింపు పొందిన శాస్త్రవేత్తల నేతృత్వంలో ఐరోపాలో పని చేసి, అక్కడే ఉండకుండా భారతదేశం రావటమే స్వామినాథన్ దేశభక్తికి నిదర్శనం. ఆయన దేశ ఉన్నత వ్యవసాయ పరిశోధనా మండలి నిర్దేశకుడిగా ఎదగటం విలువైన విషయం. కేంద్ర ప్రభుత్వ ముఖ్య వ్యవసాయ సలహాదారుగా ప్రముఖ పాత్ర వహించారు. దేశ ఆహార భద్రతకు కీలకమైన గోధుమ పంట సాగును మలుపు తిప్పేందుకు కృషి చేసి ఎందరో శాస్త్రవేత్తల్ని, విద్యావేత్తల్ని తయారుచేశారు. సమాంతరంగా ఆసియా దేశాల మూల వరి వంగడాల ప్రభావాలతో మార్చబడిన వారి వ్యవసాయాన్ని మలుపు తిప్పారు. ఫలితంగా 1980-85 నాటికి దేశంలో తిండిగింజల ఉత్పత్తి ఐదు రెట్లు పెరిగింది. సమాంతరంగా వివిధ ఆహార పంటలు, వ్యవసాయ ఉప వృత్తుల ఉన్నతికి తగిన మానవ వనరును రూపొందించగలిగిన సంస్థలెన్నో ఏర్పడ్డాయి. అనేక ఆసియా, ఆఫ్రికా దేశాల వ్యవసాయ పరిశోధనారంగ ప్రగతికి తోడ్పడ్డారు. చైనా, వియత్నాం, ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్ వంటి దేశాల పరిశోధనా రంగ ప్రగతికి తోడ్పాటునిచ్చారు. చైనా నెలకొల్పిన వ్యవసాయ వ్యవస్థ ప్రత్యేకతను గుర్తించారు. స్వామినాథన్‌ను అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అలానే, అనేక సంస్థలు, వ్యక్తులు పురస్కారిచ్చారు. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి ద్వారా ఆయన మొదటి 'ప్రపంచ ఆహార పురస్కారం' పొందటం విశేషం. మరణానంతరం భారత రత్న కూడా ఇచ్చారు. భారతదేశం హరిత విప్లవ వరవడిలో నష్టపోయిన, స్థానిక చిరుధాన్య పంటల అభివృద్ధికి తన సంస్థ ద్వారా కృషి సల్పారు. అలానే వ్యవసాయ అనుబంధ వృత్తిగా ఉన్న మత్స్యకారులు అభివృద్ధికి తగిన పథకాలను రూపొందించి దక్షిణ భారతదేశ తీర ప్రాంతంలో పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు నిర్వహించారు. మడ అడవుల్ని రక్షించి జలజీవాల మనుగడను కాపాడే పథకాలను అమలు చేశారు. ఆహార భద్రత పథకాల అమలు విషయంలో ప్రభుత్వాల ఆచరణ అంశాలను విశ్లేషించగల శాఖల్ని నిర్వహించారు. జీవిత చివరి దశలో జాతీయ రైతు కమిషన్ బాధ్యుడిగా, భారతదేశ రైతులకు తగిన సంస్కరణలను ముఖ్యంగా ఆదివాసీలకు, చిన్న సన్నకారు వృత్తిదారుల అభివృద్ధికి తగిన విధంగా సూచనలివ్వటం గర్వించదగిన విషయమని చెప్పుకొన్నారు. అఖిల భారత కిసాన్ సభ నాయకులతో కలిసి, తను ఆశించిన ప్రభుత్వాల వైఖరిలో రావాల్సిన మార్పుల్ని వ్యక్తపరిచారు. పరోక్షంగా భూసారం, పర్యావరణం కాపాడబడాలంటే, దున్నే వారికే భూమి, సాగునీటి వనరు ఉండాలని వివరించారు. పంట భూములు వ్యవసాయేతర రంగాలకు, సంస్థలకు మరల్చకూడదని సూచించారు. వ్యవసాయ రక్షణకు ప్రత్యేక వ్యవసాయ మండళ్లను రూపొందించాలని సూచించారు. ఇవన్నీ ఎంతో విలువైన సమాచార భాండాగారంగా గుర్తించి అమలు చేయాలి. దేశీయ వ్యవసాయాన్ని పరుగులు పెట్టించి, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, ప్రజలకు ఆహారధాన్యాలను అందించడమే స్వామినాథన్‌కు మనమిచ్చే నిజమైనా నివాళి అని గుర్తించాలి.

వైపరీత్యాల సుడిలో దేవభూమి

దేవభూమిగా పేరు పొందిన ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాలు వైపరీత్య వలయాలుగా మారడం శోచనీయం. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఆకస్మిక వరదల ప్రళయం జనజీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. ఉత్తరాఖండ్‌లో మెరుపు వరదలు, క్లౌడ్ బరస్ట్‌ల విపత్తుతో కేరళకు చెందిన 28 మంది పర్యాటకుల బృందం గల్లంతైంది. వీరిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడిన వారు కాగా, మిగిలిన 8 మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందిన వారుగా గుర్తించారు. ఉత్తరాఖండ్‌లో నాలుగు జాతీయ రహదారులతో సహా 617 రోడ్లు ధ్వంసమయ్యాయి. 130 మందికి పైగా ప్రజలను సహాయక బృందాలు రక్షించాయి. కొండచరియలు విరిగిపడుతున్నాయి. ధరాలీ గ్రామమే వరదలకు కొట్టుకుపోయింది. మరో గ్రామం సుకీ జలమయమైంది. హిమాచల్‌లో ఎడతెరిపి లేని వర్షాల కారణంగా కిన్నౌర్ జిల్లాలో భారీ వరదలు సంభవించడంతో కైలాస్ యాత్ర ట్రెక్కింగ్ మార్గంలో వందలాది మంది యాత్రికులు వరదల్లో చిక్కుకున్నారు. ఐటిబిపి సిబ్బంది స్పందించి 413 మంది యాత్రికులను కాపాడగలిగింది. ఈ విధంగా ఏటా ఈశాన్య భారతంలో జలప్రళయం సంభవించడం, కొండచరియలు విరిగిపడడం, గ్రామాలు నేలమట్టం కావడం తరచుగా జరుగుతోంది. పర్యాటక ప్రాంతాలకు ప్రసిద్ధి చెందిన ఈశాన్య భారతంలో టూరిజం అభివృద్ధి చెంది ఆదాయం బాగా వస్తున్నా పొంచి ఉన్న విపత్తుల నివారణ ప్రణాళికలపై ఆయా ప్రభుత్వాలు శ్రద్ధ చూపించడం లేదు. మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాల్లో 125 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయే సరికి పాలనా యంత్రాంగాలు కళ్లు తెరిచి లబోదిబోమనడం తప్ప ఈ వైపరీత్యాలను ఎలా నివారించగలమో అన్న ప్రయత్నాలు సరిగ్గా జరగడం లేదు. 2013 లో కేదార్‌నాథ్ విషాద సంఘటన నుంచి దేశం సరైన గుణపాఠం నేర్చుకోవడం లేదనిపిస్తోంది. ఆనాడు వేలాది గ్రామాలు వరదల్లో దెబ్బతిన్నాయి. 5000 మంది గల్లంతయ్యారు. క్రమబద్ధం లేకుండా సాగే రియల్ ఎస్టేట్ నిర్మాణాలు విధ్వంసాన్ని మరింత తీవ్రం చేశాయి. 2021లో హిమనదీయ సరస్సు విస్ఫోటనంతో వరద ప్రళయం సంభవించి చమోలీ ప్రాంతాన్ని నాశనం చేసింది. అలాగే జోషిమఠ్ విధ్వంసం ప్రళయం సృష్టించింది. టూరిస్టులను ఆకర్షించడానికి నదీ తీర ప్రాంతాల్లో విలాసవంతమైన విల్లాల నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది. ప్రకృతిపరంగా కొన్ని వైపరీత్యాలు జరుగుతుండగా, మానవ కల్పిత చర్యల వల్ల అంతకన్నా ఎక్కువగానే నష్టం జరుగుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు మౌలిక సదుపాయాల అభివృద్ధి జరగకపోవడం ప్రధాన లోపం. సౌకర్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య నెలకొన్న సంక్లిష్టతపై చర్చలు జరుగుతున్నాయి. ఈ రాష్ట్రాల్లో శాస్త్రీయ విశ్లేషణ అనుసరించి నిర్మాణాలు చేపట్టడం అవసరం. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణాలతో అత్యధిక సంఖ్యలో చెట్లను కూల్చి వేస్తున్నారు. 2015 నుంచి 2018 మధ్య కాలంలో 10.76 మిలియన్ చెట్లను కూల్చివేశారు. అరుణాచల్‌లోని భారీ డిబాంగ్ డ్యామ్ నిర్మాణం కోసం 2.7 లక్షల చెట్లను కూల్చివేశారు. డెహ్రాడూన్‌లో ప్రాజెక్టుల కోసం 11,000 చెట్లను కూల్చివేయడానికి ప్రభుత్వ వర్గాలు సిద్ధం కాగా, సుప్రీం కోర్టు అడ్డుచక్రం వేసింది. కొండలను తొలిచి సొరంగాలు నిర్మిస్తున్నారు. రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు ఒక ప్రణాళిక లేకుండా సాగే కొండ క్వారీ పనులు ఇవన్నీ కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని జివిస్‌ఐ అధ్యయనం పేర్కొంది. గత ఏడాది నైరుతి పవనాల ప్రభావంతో సిక్కిం, అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయాల్లో కుంభవృష్టి సంభవించి ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. వేలాది మంది నిర్వాసితులయ్యారు. 34 మంది ప్రాణాలు కోల్పోయారు. అసోంలోని 19 జిల్లాల్లో మూడు లక్షల మంది వరకు వరద బాధితులయ్యారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల నివారణకు బడ్జెట్‌లో మూడోవంతు వెచ్చిస్తోంది. అయినా సరైన ప్రణాళికలు ఆచరణలోకి రావడం లేదు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో నేల క్షీణించి కోతకు గురికావడం. జోషిమఠ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో విపరీత పరిణామాలు సంభవించడం చర్చనీయాంశం అవుతున్నాయి. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జివిస్‌ఐ) ఈ కొండచరియల ప్రమాదాలపై 2020లో అధ్యయనం నిర్వహించింది. దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్‌లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు అకస్మాత్తుగా విరిగిపడడానికి కారణమవుతున్నాయని జివిస్‌ఐ తన నివేదికలో హెచ్చరించింది. అలాగే కొండచరియలు విరిగిపడడానికి ఉత్తరాఖండ్ 51 శాతం అనువైన ప్రాంతంగా వాడియా ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. ప్రపంచంలోనే భూకంపాలు సంభవించే ఆరో ప్రాంతంగా ఈశాన్య ప్రాంతం రికార్డుకెక్కింది. ఈ ప్రాంతాల్లో ఆరు నెలలపాటు భారీగా వర్షాలు కురుస్తుంటాయి. కొండచరియల ముప్పు తప్పించడానికి నిర్మాణాత్మక ఇంజినీరింగ్ పనులు చేపట్టడం అవసరమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచిస్తోంది. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను గుర్తించి వాటిని నివారించడానికి, తగిన మౌలిక సౌకర్యాలు కల్పించడానికి 'నేషనల్ ల్యాండ్ స్లైడ్ ససెప్టిబిలిటీ మేపింగ్' ప్రక్రియను అమలు చేయవలసి ఉంటుందని జివిస్‌ఐ సూచిస్తోంది.

రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో అనూహ్య ఘటన

కాంగ్రెస్ నేతలపై వాటర్ బాటిల్ విసిరిన కోవా లక్ష్మి

ఆసిఫాబాద్,ఆగస్ట్7 : బీఆర్ఎస్ పార్టీ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి సహనం కోల్పోయారు.. రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలపై విరుచుకుపడ్డారు.. చేతికి ఏది దొరికితే వాటిని విసిరేశారు. టేబుల్ పై ఉన్న వాటర్ బాటిళ్లను కాంగ్రెస్ నేత శ్యామ్ నాయక్ పై విసిరేస్తూ రచ్చ చేశారు. కొమరంభీం జిల్లా జన్కపూర్ లో గురువారం ఉదయం.. రేషన్ కార్డు పంపిణీ ప్రోగ్రాం నిర్వహించారు అధికారులు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కోవా లక్ష్మి ప్రవర్తనతో అక్కడ ఉన్న అందరూ షాక్ అయ్యారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. కొమరంభీం జిల్లా జన్కపూర్ లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ఎమ్మెల్యే కోవా లక్ష్మి సహనం కోల్పోయి కాంగ్రెస్ నేతలు, ప్రజల మీద విరుచుకు పడ్డారు. కాంగ్రెస్ నాయకుడు శ్యామ్ నాయక్ పై వాటర్ బాటిల్స్ విసురుతూ రెచ్చిపోయారు కోవా లక్ష్మి. చేతికి ఏది దొరికితే అది విసురుతూ దాడి చేశారు ఎమ్మెల్యే. రేషన్ కార్డుల పంపిణి సందర్భంగా ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వివాదం నెలకొంది.రేషన్ కార్డుల పంపిణీ గవర్నమెంట్ ప్రోగ్రాం అని.. ఇక్కడ రాజకీయాలు మాట్లాడొద్దని అన్నందుకు కాంగ్రెస్ నాయకులు, అధికారులపై విరుచుకుపడ్డారు ఎమ్మెల్యే లక్ష్మి. రాజకీయాలు మాట్లాడద్దని వారిస్తున్నా వినకుండా ఎందుకు మాట్లాడొద్దంటూ తిరిగి కాంగ్రెస్ నాయకులపై దాడికి దిగారు కోవా లక్ష్మి. ఎమ్మెల్యే తీరు పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ప్రజలు.

వైసిపి నేతలపై పోలీస్ కేసు

కడప,ఆగస్ట్7 : వైసీపీ నేతలు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, సతీష్ రెడ్డిలపై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. అవినాష్ రెడ్డి, సతీష్ రెడ్డిలు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి అనుమతి లేకుండా అధిక సంఖ్యలో కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారని ఎంపీడీవోకు కొంతమంది ఫిర్యాదు చేశారు. పులివెందులలో నిన్న జరిగిన ఘర్షణకు సంబంధించి తెలుగుదేశం వైసీపీ శ్రేణులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి.

దళిత యువకుడి కిడ్నాప్ చిత్రహింసలు

భూమన అనుచరులుగా గుర్తించిన పోలీసులు

తిరుపతి,ఆగస్ట్7 : తిరుపతిలో వైకాపా మాజీ ఎమ్మెల్యే, తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అనుచరులు రెచ్చిపోయారు. సెటిల్‌మెంట్లతో ప్రజలను భయపెడుతున్నారు. కార్ డెకార్స్‌కు సంబంధించిన దుకాణం తనకు ఇవ్వాలంటూ భూమన ప్రధాన అనుచరుడు చైతన్య యాదవ్.. ఓ వ్యక్తిపై దాడికి దిగిన ఘటన మరువక ముందే మరో దారుణం వెలుగులోకి వచ్చింది. బుధవారం రాత్రి.. తిరుపతి లోని శ్రీనివాసం వసతిగృహం ఎదురుగా ఉన్న దుకాణం కాంట్రాక్ట్‌ను తనకు రాసివ్వాలంటూ వైకాపా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి అనిల్ రెడ్డి దౌర్జన్యానికి దిగారు. పవన్ అనే దళిత యువకుడిని కిడ్నాప్ చేసి ఎంఆర్‌పల్లిలోని తన ఇంట్లో బంధించి తీవ్రంగా హింసించారు. గిరిజన యువకుడిని చితకబాదుతుండగా అనిల్ రెడ్డి స్నేహితులు వీడియో తీశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరుల ఆగడాలపై హోం మంత్రి అనిత స్పందించారు. రౌడీ రాజకీయం చేస్తూ ఉంటే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, ఎంతటి వారైనా చట్టం ముందు సమానులేనన్నారు. తిరుపతిలో దాడికి పాల్పడిన వారిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన వెనుక ఉన్న సూత్రధారులను కూడా వదిలేది లేదు. వైకాపా రాక్షస మనస్తత్వానికి ఈ దాడులే నిదర్శనం. దాడి చేసిన వారి పరామర్శకు పులివెందుల ఎమ్మెల్యే వెళ్తారా?' అని హోం మంత్రి అన్నారు. తిరుపతిలో గిరిజన యువకుడిపై వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి అనుచరుల దాడి ఘటనను పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. డ్రైవర్ పవన్ కుమార్‌పై దాడి వీడియో వైరల్‌గా మారడంతో లోతైన విచారణకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రంగంలోకి దిగిన పోలీసులు.. కరుణాకర్ రెడ్డి, ఆయన తనయుడు అభినయ్ రెడ్డి సమక్షంలో, వారి కార్యాలయంలోనే ఈ దాడి జరిగినట్లు భావిస్తున్నారు. బాధితుడు పవన్ తండ్రి నీలం జయరాజు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తిగా ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఘటనలో ఇద్దరు ముగ్గురు పాల్గొన్నారని అధికారులు నిర్ధారించినట్లు- తెలుస్తోంది. ఇప్పటికే జగ్గారెడ్డి అనే ఒక నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, వీరిని మధ్యాహ్నం లోగా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.దళిత డ్రైవర్‌పై దాడి చేసిన అనిల్ రెడ్డితో పాటు- దాడిలో అభియన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఇతరుల పాత్రపైనా కూడా అధికారులు విచారణ చేస్తున్నారు. హింసిస్తూ వీడియోలు తీయడమే కాకుండా వాటిని ఎవరెవరికి పంపారనే అంశంపైనా విచారణ జరుపుతున్నారు. పవన్ కుమార్‌ను ఏ కారణంతో దాడి చేశారు?దళిత యువకుడిని ఇంత పాశవికంగా హింసించడానికి గల కారణాలు ఏంటి అనే కోణంలోను దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తును పర్యవేక్షిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు ఘటనలో కారకులైన అందరిపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సత్యనిష్ఠే..ఏకైక మార్గం

ఆధ్యాత్మికం

'భావనమే' జీవనం. జీవ దేహం కేవలం ఒక ఉపకరణం. ఇంద్రియ గ్రహణం, ప్రజ్ఞ, ఉద్వేగాలు, అభ్యాసం, అస్తిత్వరూపం, నిర్ణయాలు, పట్టుదల, అనుభూతి విస్తృతి.. అన్నీ భావప్రపంచమే. అయితే .. ఈ భావప్రపంచం సత్య, శాంత, స్పష్ట సమర్థతతో, సుసంస్కారంతో సాగాలంటే.. శరీరం సంతులిత సమర్థతతో పనిచేస్తూ ఆరోగ్యంగా ఉండటం అత్యవసరం. కానీ, తగినంత ఆరోగ్యంగా ఉన్నవారిలో కూడా చాలావరకు భావప్రపంచం సమర్థతతో పనిచేయకపోవడం కీలకమైన సమస్య. అందులోనూ అధికారం, ధనం, విద్య (మేధస్సు) ఉన్నవారిలో ఈ దోషం ఉండటం సమాజానికి ప్రబలమైన సమస్య. భావప్రపంచాన్ని సంస్కార బలంతో నడుపగలిగింది సదా 'సత్యనిష్ఠ'. సత్యజీవనం.. విద్య. అసత్య జీవనం.. అవిద్య. దైనందిన మానవ జీవనం సత్యాసత్యాల 'మిశ్రమం'. 'సమానతా భావమయమైన' సరళ జీవనం, సమష్టి శాంతి, నిర్భయత, ఆరోగ్యం, కృషి, పరస్పర ఆదరణ, ఆధ్యాత్మిక సాధన, సంతృప్తి, ఆనందా నుభవం ఇవన్నీ అనివార్యంగా సత్యాన్ని ఆశ్రయించి సాగుతుంటాయి. 'ఆధిక్యతాభావమయమైన' సంపద్గత జీవనం, కాంక్ష , ప్రకృతిశోషణ, ఘర్షణ, హననం, ఆక్రమణ, ప్రాణ నష్టం, భయం ఇవి అసత్యాన్ని ఆశ్రయించి సాగుతాయి. మానవ 'జీవితాన్ని శాసించవలసిన సత్యాలు.

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం

ఇరవై ఐదు సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయం

మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పటాన్ చేరు ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రభుత్వ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు

వంద మంది ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్)పటాన్ చేరు : నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, భావి భారత పౌరులను తయారు చేయాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా ప్రతి ఏటా గురు పూజోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. పటాన్ చేరు జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రభుత్వ పాఠశాల గురుపూజోత్సవ వేడుకలకు అదనపు కలెక్టర్ పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న వంద మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో ఒక విద్యార్థి ఉత్తమ పౌరుడుగా ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు ఉత్తమ భవిష్యత్తును అందిస్తారని అన్నారు. పటాన్ చేరు నియోజకవర్గంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులను ఉత్తమ బోధన చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం పట్ల ఎమ్మెల్యే జిఎంఆర్ ను ప్రశంసించారు. పటాన్ చేరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాత్ర అభినందనీయమని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతి విద్యార్థిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించడం పట్ల అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎటువంటి సమస్యలు ఉన్న స్వయంగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముందుంటారని కితాబుని ఇచ్చారు. ప్రతి సంవత్సరం పదోవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సైతం ప్రోత్సాహకాలు అందించడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాల వినియోగం ఒక జటిల సమస్యగా మారిందని అన్నారు. పాఠశాల స్థాయి నుండి మత్తుమదార్థాలు వాడకం వల్ల కలిగే అనార్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను కోరారు. మినీ ఇండియాగా పేరుందిన పటాన్ చేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల భవనాలు తీర్చిదిద్దుతూ మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య మూలంగా అడ్మిషన్లు సైతం దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా ప్రతి ఏటా గురుపూజోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసి, ఉత్తమ గురువులను సన్మానించడం సంతోషకరంగా ఉందని తెలిపారు. అనంతరం పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న వంద మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృతంలో ప్రతి సంవత్సరం గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులచే ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. గురువులకు పాదాభివందనం పేరుతో తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమానికి మంత్రముగ్ధులైన ఎమ్మెల్యే జిఎంఆర్. స్వయంగా ఇరవై ఆరు వేల రూపాయల నగదు బహుమతి అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధే నా లక్ష్యం

ఈదుల నాగులపల్లిలో రూ.ఇరవై ఐదు లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

మూడు లక్షల రూపాయల విరాళం

సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్)రామచంద్రపురం : నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్ చేరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తెల్లాపూర్, ఈదుల నాగులపల్లి గ్రామంలో రూ. ఇరవై ఐదు లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ఉదయం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈదుల నాగులపల్లిలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కోసం తన సొంత నిధుల నుంచి రూ.మూడు లక్షలు అందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతులను మరింతగా అభివృద్ధి చేస్తామని, అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, డిఈ కృష్ణవేణి, ఏఈ ఫైజాన్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు రవీందర్ రెడ్డి, కొమరయ్య, శ్రీకాంత్, నాగరాజు, శ్రీశైలం, నాయకులు రమేష్, చెన్నారెడ్డి, సాయి చరణ్ గౌడ్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మా భూమిని మాకు ఇప్పించండి

- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

బాధితురాలు కోయిల్ కార్ శైలజ ఆవేదన

రామగిరి, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్) : తన తాత, తండ్రి నుంచి వారసత్వంగా రావాల్సిన భూమిని తమకు ఇప్పించాలని కోరుతూ బాధితురాలు కోయిల్ కార్ శైలజ ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తన గోడును వెళ్లబోసింది.ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. తన తాత ఆన్ కార్ రాజయ్య పేరు మీద 997 సర్వే నెంబర్ లో 5 ఎకరాల 36 గుంటల భూమి ఉండేదని తెలిపింది. తాత తర్వాత ఆ భూమి తన కుమారులైన ఆన్ కార్ కిషన్, ఆన్ కార్ శంకర్ లకు సమానంగా రావాల్సి ఉందని చెప్పింది.తన తండ్రి ఆన్ కార్ కిషన్ చనిపోయిన తర్వాత తన బాబాయి ఆన్ కార్ శంకర్ ఆ మొత్తం భూమిని తన పేరు మీద దొంగ పట్టా చేయించుకున్నాడని ఆరోపించింది. తమకు రావాల్సిన వాటా భూమిని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయింది.5 ఎకరాల 36 గుంటల్లో తమకు రావాల్సిన 2 ఎకరాల 38 గుంటల భూమికి గాను కేవలం 10 గుంటల భూమిని మాత్రమే దాన సెటిల్మెంట్ కింద ఇచ్చాడని, మిగిలిన 2 ఎకరాల 28 గుంటల భూమిని ఇవ్వడం లేదని తెలిపింది. తమ తాత భూమిని దొంగచాటుగా తన పేరు మీద పట్టా చేయించుకుని ఇతరులకు అమ్ముకుంటున్నాడని ఆమె ఆరోపించింది.తమకు న్యాయం చేయాలని కోరుతూ మంథని ఆర్డీవో, తహసీల్దార్ చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదని వాపోయింది.తనకు న్యాయపరంగా రావాల్సిన 2 ఎకరాల 28 గుంటల భూమిని ఇప్పించాలని, ఒకవేళ న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయిస్తానని ఈ సందర్భంగా బాధితురాలు కోయిల్ కార్ శైలజ హెచ్చరించింది.

మంథనిలో ఫ్లెక్సీలకే పరిమితమైన ప్లాస్టిక్ నిషేధం..

- కిరాణా,బేకరీ, మార్కెట్ లో యథేచ్ఛగా విక్రయాలు..!

- మంథని మున్సిపాలిటీ తీరుపై ప్రజల ఆగ్రహం...

- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్...

రామగిరి, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్):- మంథని మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అంటూ మున్సిపల్ అధికారులు పెద్ద ఎత్తున పేపర్ ప్రకటనలు,ఫ్లెక్సీ లు బ్యానర్లు కట్టి చేతులు దులుపుకుంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మారలేదు. మంథని కూరగాయల మార్కెట్, కిరాణా, బేకరీ ల్లో ప్రధాన బజార్లలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వాడకం యథేచ్ఛగా సాగుతోంది. పురపాలక సంఘం మంథని పేరుతో "ప్లాస్టిక్ కవర్స్ నిషేధము పై అవగాహన కార్యక్రమం" అంటూ మున్సిపాలిటీ ముందు భారీ బ్యానర్ పెట్టారు తప్ప, ఒక్క దుకాణం పై కూడా దాడులు చేయడం లేదు , జరిమానాలు విధించడం లేదు. గతంలో మాత్రం చెత్త నిషేదం అంటూ గరిబోళ్ల షాప్ ల ముందు చిన్న చిత్తూ కాగితం ఉన్న కూడా రెండు నుండి మూడు వేల రూపాయలు ఫైన్ వేసిన మున్సిపాలిటీ అధికారులు ఇప్పుడు ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించే వారికి ఎందుకు జరిమానా విధించడం లేదు పండ్లు, కూరగాయలు, మాంసం దుకాణాల్లో 75 మైక్రాన్ల కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. నిషేధం కేవలం ఫ్లెక్సీలకే పరిమితమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్,చైర్మన్ సంబంధిత అధికారులు ఫోటోలకు ఫోజులిచ్చి, అవగాహన పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప, నిబంధనలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వదిలి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణానికి హాని చేయని నూలు సంచులు, జూట్ బ్యాగ్ లు కాగితపు సంచుల వాడకాన్ని ప్రచారం లోకి తీసుకురావాలని కిరాణా బేకరీ,కూరగాయల మార్కెట్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని పట్టణ ప్రజల తో పాటు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటిన మంథని గురుకుల విద్యార్థులు

రామగిరి, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్):- స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కబడ్డీ ఆటలో మంథని పట్టణానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు) విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో బహుమతి సాధించారు. బహుమతి సాధించిన విద్యార్థులను మంగళవారం సాంఘిక సంక్షేమ గురుకుల సమన్వయ సంస్థ అధికారి, ప్రిన్సిపల్ ఊటూరి శ్రీనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలో చదువుతోపాటు ఆటల పైన ఆసక్తి కనబరిచాలని తెలిపారు. ఆటలు శారీరకంగా మానసికంగా మరింత దృఢంగా చేయడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేకమైన నైపుణ్యం ఉంటుందని, దానిని గుర్తించి జీవితంలో పైకి రావాలని తెలిపారు. విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉందని, అందుకు కారణమైన పిడి రమేష్, పిఈటి పుష్పలతలను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపల్ నవీన్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్, పాఠశాల/కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోటి తొంబై మూడు లక్షల రూపాయలతో సెంట్రల్ లైటింగ్

పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్) : రామచంద్రపురం, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ డివిజన్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందిస్తున్నామని పటాన్ చేరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు డబల్ బెడ్ రూమ్ ఫేజ్ వన్ నుండి ఉస్మాన్ నగర్ వరకు ప్రధాన రహదారి పైన సెంటర్ మీడియన్ పైన ఒక కోటి తొంబై మూడు లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ దీపాల ఏర్పాటు పనులకు మంగళవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెల్లాపూర్ డివిజన్ పరిధిలో జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా రాత్రి వేళల్లో ప్రయాణించే ప్రజలకు మెరుగైన వెలుతురు అందడంతో పాటు రహదారి మరింత సురక్షితంగా, సుందరంగా మారుతుందని పేర్కొన్నారు. పటాన్ చేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని, ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపురం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, డిఈ కృష్ణవేణి, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిల్-ఫోర్ట్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు...

రామగిరి,సెప్టెంబర్22(ది క్రైమ్ న్యూస్):- సెంటినరీ కాలనీ లోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో నడపబడుచున్న హిల్ ఫోర్ట్ స్కూల్ లో ప్రీ ప్రైమరీ విద్యార్థిని, విద్యార్థులకు గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ హాజరుకాగా వారితో వారి వారి మనవడు మనవరాళ్ల తో ఆటలు ఆడించడం, డ్యాన్సులు చేయించడం జరిగింది. ఆటలలో గెలిచిన వారికి చిన్న చిన్న బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంను ఉద్దేశించి కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల శ్రీనివాస్ లు మాట్లాడుతూ మనపై వారు చూపించే ప్రేమ, అనురాగం ఎంతో ప్రత్యేకమైనవి, జీవితంలో వారు సంపాదించిన అనుభవాలను మనకు చెప్పి మంచి మార్గాన్ని చూపిస్తారు, కుటుంబ ఆచారాలు, పండుగలు, విలువలు, సంప్రదాయాలను మనకు పరిచయం చేస్తారు, చిన్ననాటి కథలు, కుటుంబ చరిత్ర చెప్పడం ద్వారా మనలో ఆసక్తిని పెంచుతారు, పెద్దలను గౌరవించడం, ఇతరులను ప్రేమించడం, మంచితనంతో ఉండడం వంటి విలువలను నేర్పుతారు, మన సమస్యలను ఓపికగా విని, ధైర్యం చెప్పి, మనకు అండగా నిలుస్తారు అని, తాతయ్యలు, నానమ్మలు--అమ్మమ్మలు కుటుంబానికి పెద్దలుగా మాత్రమే కాకుండా, ప్రేమను పంచే మార్గదర్శకులు, మన సంస్కృతికి వారసత్వాన్ని అందించే అమూల్యమైన వ్యక్తులు. వారి ప్రేమ, ఆశీర్వాదాలు మన జీవితంలో ఎంతో విలువైనవి అని తెలిపారు. ఇట్టి కార్యక్రమం నకు విచ్చేసిన గ్రాండ్ పేరెంట్స్ కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నందుకు పాఠశాల మేనేజ్ మెంట్ నకు కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వానికి లోనైనారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మంథని మండల అధ్యక్షుడిగా గాదర్ల కొమురయ్య, కార్యదర్శిగా ఎగ్గడి సురేష్

రామగిరి , సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్):- పీఆర్టీయూ యూనియన్ మంథని మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా గాదర్ల కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎగ్గడి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సాయంత్రం మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎండి గియాస్ ఉద్దీన్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా పల్లెర్ల సురేష్, మహిళా అధ్యక్షురాలిగా సుద్దాల శ్రీలత, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె. లావణ్య, కార్యదర్శులుగా ఏ. శ్రీనివాస్, ఏపీ రాజు, మహిళా కార్యదర్శులుగా బద్దం వినీత, ఎం విజయలను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ముంజాల హరికృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి గణపతిని ప్రతిష్ఠించి, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు

- గోకుల్ నగర్ మట్టి గణపతిని దర్శించుకున్న ప్రముఖులు
- పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాల వినియోగం అభినందనీయం
- ఆర్జీ త్రీ జీఎం సుంకర మధుసూదన్

రామగిరి, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్):– కల్వచర్ల గ్రామంలోని గోకుల్ నగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఆర్జీ త్రీ జీఎం సుంకర మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై మట్టి గణపతిని దర్శించుకున్నారు.వీరితో పాటు అధితులుగా ఎస్టేట్ డీవైజీఎం ఐలయ్య, రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ, పీవీ రావు, సివిల్ సూపర్‌వైజర్ మరియు లయన్స్ క్లబ్ డైరెక్టర్ బెల్లం జ్యోతి శ్రీనివాస్, కల్వచర్ల ఉపసర్పంచ్ కస్పా మహేందర్ తదితరులు పాల్గొని మట్టి గణపతిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆర్జీ త్రీ జీఎం సుంకర మధుసూదన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి గణపతిని ప్రతిష్ఠించి, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న గోకుల్ నగర్ యాదవ సంఘం సభ్యులను ప్రముఖులు అభినందించారు. మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు.అనంతరం గోకుల్ నగర్ యాదవ సంఘం కమిటీ సభ్యులు ప్రముఖ అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించి, గణపతి చిత్రపటాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలు నాటండి... ప్రాణవాయువు పెంచండి

- ఎంపీఓ మోతే, సర్పంచ్ పల్లె

రామగిరి, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్):– మొక్కలు నాటండి ప్రాణవాయువు పెంచండని రామగిరి ఎంపీఓ మోతే సమ్మిరెడ్డి, రత్నాపూర్ సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు అన్నారు. రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు మొక్కలు నాటే కార్యక్రమం పై దృష్టి సారించాలని కోరారు. దీనివల్ల మనం పర్యావరణ పరిరక్షణ కాపాడిన వారమవుతామన్నారు. నేడు ప్రపంచంలో ఆక్సిజన్ కొనుక్కునే పరిస్థితి వచ్చింది అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులకు అవగాహన పెంచారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భద్రపు ప్రవళిక ప్రశాంత్, ప్రధానోపాధ్యాయులు బుర్రి శ్యామ్, సెక్రటరీ గంగుల సంతోష్ పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమం కోసం హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు

- కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు పై అధ్యయనం చేయాలని అధికారులకు ఆదేశించిన కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి. హైదరాబాదులోని బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్ లో మంగళవారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం గారితో కలిసి కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులతో హమాలి సంక్షేమ బోర్డు ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటుకై తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ నుండి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుంటి సామ్రాజ్యం, అన్నెడి వెంకట్ రెడ్డి, ఎస్ వి శివకుమార్, కన్నెగంటి రవి (రైతు స్వరాజ్య వేదిక) ఎస్ కే. సల్లావుద్దీన్ ఐదుగురు సభ్యులను కమిటీకి ఎంపిక చేసి కార్మిక శాఖకు పంపించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి యూనియన్ నాయకులతో బోర్డు విధి విధానాలపై చర్చించి మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల హమాలి సంక్షేమ బోర్డు తరహాలో విధి విధానాలను త్వరగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగ సంపత్, కార్యదర్శి గెల్లి రాయలింగు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లచ్చన్న (నాగర్ కర్నూల్ బజార్), రాజు (మూసాపేట రైల్వే గూడ్ షెడ్ అధ్యక్షులు), భాస్కర్ (అచ్చంపేట బజార్) తదితరులు పాల్గొన్నారు.

కల్వచర్ల గ్రామ అభివృద్ధికి సహకరించాలి

ఆర్జీ త్రీ జీఎం సుంకర మధుసూదన్ ని కలిసి

సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి వినతిపత్రం అందజేత

రామగిరి, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్):– రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అవసరాలపై కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి, వార్డు సభ్యులతో కలిసి ఆర్జీ––త్రీ జీఎం సుంకర మధుసూదన్ ని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులకు సహకారం అందించాలని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి సంబంధిత అధికారుల సహకారంతో ముందుకు సాగుతామని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు మల్యాల పద్మ,కొయ్యడ పద్మ,బండ సంపత్,కొట్టే నాగరాజు ,రొడ్డ విజయ్,చిందం కవిత,రేండ్ల కుమారస్వామి పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో ఎండీఎంఏ విక్రయానికి యత్నం.. ఇద్దరి అరెస్టు

మేడ్చల్, సెప్టెంబర్ 22వా(ది క్రైమ్ న్యూస్) : మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఎండీఎంఏ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని ఎస్‌వోటీ మల్కాజిగిరి జోన్, మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 23 గ్రాముల ఎండీఎంఏ, రెండు సెల్‌ఫోన్లు, రూ.5,600 నగదు, ఒక హ్యాండ్‌బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి మొత్తం విలువ రూ.2.76 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. అరెస్టైన వారిని మహావీర్‌సింగ్ (28), లక్ష్మణ్‌సింగ్ రాజ్‌పురోహిత్ (45)గా గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సెప్టెంబర్ 21 మధ్యాహ్నం మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలోని వేపచెట్టు వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను తనిఖీ చేయగా పాలిథిన్ కవర్లలో దాచిన ఎండీఎంఏ లభ్యమైంది. ప్రాథమిక విచారణలో ఈ మత్తుపదార్థాలను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లోని వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో జోధ్‌పూర్‌కు చెందిన కుల్దీప్ మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్నట్లు, కోకాపేట్‌కు చెందిన కైలాష్ కొనుగోలుదారుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం వీరిద్దరూ పరారీలో ఉండటంతో వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 707/2026 కింద ఎన్‌డీపీఎస్ చట్టంలోని 8(సి)తో పాటు 22(సి), 29 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ పర్యవేక్షణలో, ఎస్‌వోటీ డీసీపీ కె. మనోహర్, మల్కాజిగిరి జోన్ డీసీపీ చ. శ్రీధర్ ఐపీఎస్, అదనపు డీసీపీ ఎం.డి. షకీర్ హుస్సేన్ మార్గదర్శకత్వంలో ఈ దాడి నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మత్తుపదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ప్రజలకు సూచించారు.

మల్కాజిగిరిలో ఎండీఎంఏ విక్రయానికి యత్నం.. ఇద్దరి అరెస్టు

మేడ్చల్, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్) : మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఎండీఎంఏ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని ఎస్‌వోటీ మల్కాజిగిరి జోన్, మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 23 గ్రాముల ఎండీఎంఏ, రెండు సెల్‌ఫోన్లు, రూ.5,600 నగదు, ఒక హ్యాండ్‌బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి మొత్తం విలువ రూ.2.76 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. అరెస్టైన వారిని మహావీర్‌సింగ్ (28), లక్ష్మణ్‌సింగ్ రాజ్‌పురోహిత్ (45)గా గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సెప్టెంబర్ 21 మధ్యాహ్నం మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలోని వేపచెట్టు వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను తనిఖీ చేయగా పాలిథిన్ కవర్లలో దాచిన ఎండీఎంఏ లభ్యమైంది. ప్రాథమిక విచారణలో ఈ మత్తుపదార్థాలను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లోని వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో జోధ్‌పూర్‌కు చెందిన కుల్దీప్ మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్నట్లు, కోకాపేట్‌కు చెందిన కైలాష్ కొనుగోలుదారుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం వీరిద్దరూ పరారీలో ఉండటంతో వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 707/2026 కింద ఎన్‌డీపీఎస్ చట్టంలోని 8(సి)తో పాటు 22(సి), 29 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ పర్యవేక్షణలో, ఎస్‌వోటీ డీసీపీ కె. మనోహర్, మల్కాజిగిరి జోన్ డీసీపీ చ. శ్రీధర్ ఐపీఎస్, అదనపు డీసీపీ ఎం.డి. షకీర్ హుస్సేన్ మార్గదర్శకత్వంలో ఈ దాడి నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మత్తుపదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ప్రజలకు సూచించారు.

విద్యార్థుల శ్రమదానంతో పరిశుభ్రత

మేడ్చల్, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్): స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛతాహి సేవ' నినాదంతో కాప్రా సర్కిల్ పరిధిలో మంగళవారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. విజయ పబ్లిక్ స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థినీ విద్యార్థులు, కుషాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని పాఠశాల ప్రాంగణంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ప్రతి ఒక్కరూ వారానికి రెండు గంటలపాటు శ్రమదానం చేయడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజారోగ్యాన్ని మెరుగుపరచవచ్చని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలతో వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజలకు తెలియజేస్తూ, పారిశుధ్య నిర్వహణలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డీఈ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) రవి, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎస్‌ఎఫ్‌ఏలు మంజుల, లక్ష్మి, రామ్‌కీ సర్కిల్ ఇన్‌చార్జి నవీన్‌రెడ్డి, విజయ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రాజేష్, కుషాయిగూడ జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన మార్గాల్లో పటిష్ఠ ట్రాఫిక్ ఏర్పాట్లు

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : గణేశ్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ మంగళవారం వివిధ నిమజ్జన ప్రాంతాలను పరిశీలించి ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద నిమజ్జన వాహనాలు, భక్తుల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, బారికేడ్లు, వాహనాల పార్కింగ్, సిబ్బంది మోహరింపు ప్రాంతాలు, నిమజ్జన వాహనాల రాకపోకలను పరిశీలించి క్షేత్రస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. అనంతరం జీడిమెట్ల ట్రాఫిక్ డివిజన్ పరిధిలోని సూరారం కట్టమైసమ్మ చెరువు (లింగం చెరువు) వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, బారికేడింగ్, పార్కింగ్, సిబ్బంది మోహరింపు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. కేపీహెచ్‌బీ పరిధిలోని ప్రగతి నగర్ చెరువును కూడా ట్రాఫిక్ జేసీపీ పరిశీలించారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లతో పాటు వాహనాల్లో వచ్చే భక్తుల పార్కింగ్ సదుపాయాలను పరిశీలించారు. వాహనాలు, భక్తుల రాకపోకలు సజావుగా సాగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్ ప్రవాహానికి అంతరాయం కలగకుండా మళ్లింపు మార్గాలను సమర్థంగా అమలు చేయాలని, ప్రధాన ప్రాంతాల్లో బారికేడింగ్ పటిష్ఠంగా చేపట్టాలని సన్‌ప్రీత్ సింగ్ ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు కీలక ప్రాంతాల్లో తగినంత సిబ్బందిని మోహరించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జన వాహనాలు, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ప్రజా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అన్ని అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో డీసీపీ ట్రాఫిక్–2 శేషాద్రిణి రెడ్డి ఐపీఎస్, అదనపు డీసీపీ ఏ. వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లిలో గణనాథునికి ప్రత్యేక పూజలు

పూజల అనంతరం అన్నదానం..

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22 (ది క్రైమ్ న్యూస్) : కొంపల్లిలోని జై గణేష్ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి మోహన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారం గోపాల్‌రెడ్డి పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, ఉపేందర్, జయభేరి గోపాల్‌రెడ్డి, అంజితో పాటు దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. గణనాథుని నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

సురారం డివిజన్‌లో గణేష్ మండపాలను సందర్శించిన పి. శ్రీశైలం యాదవ్..

కుత్బుల్లాపూర్, సురారం, సెప్టెంబర్ 21 (ది క్రైమ్ న్యూస్): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సురారం డివిజన్ పరిధిలోని పలు గణేష్ మండపాలను పి. శ్రీశైలం యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉత్సవ కమిటీలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులు, యువత, భక్తులను అభినందించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాలని కోరారు.

జోనల్ స్థాయి క్రీడల్లో ప్రగతి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

-జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి

రామగిరి, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్):– నేషనల్ స్కూల్ గేమ్స్ 2026––27లో భాగంగా నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక ప్రగతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.అండర్––14 విభాగంలో ఓ. అనీష్ కబడ్డీ, రన్నింగ్ విభాగాల్లో, పి. దీక్షిత్ కబడ్డీ విభాగంలో, సిహెచ్. రాజకుమార్, ఎస్. మను శ్రీ కోకో విభాగంలో ప్రతిభ చూపారు. అదేవిధంగా అండర్––17 విభాగంలో ఫణి తేజ షాట్‌పుట్‌లో, బి. కౌశిక్ కబడ్డీ విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి అభినందించి మేమెంటోలను అందజేశారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ కొప్పుల గోవర్ధన్ రావు,పిఈటీ భాగ్యలక్ష్మి, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బుడిగె లక్ష్మి అంతిమ యాత్రలో గౌడ సంఘ నాయకులు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్) :కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొలంపల్లిలో గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ తిరుపతి గౌడ్ అత్తమ్మ బుడిగె లక్ష్మి అనారోగ్య కారణాల వల్ల మంగళవారం మృతి చెందారు.మంగళవారం నిర్వహించిన లక్ష్మి అంతిమయాత్రలో గౌడ సంఘం నియోజకవర్గ ఇన్చార్జ్ గోపగోని నవీన్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్యాల రాములు గౌడ్, మాజీ ఎంపిటిసి బండారి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ బుడిగ కొండయ్య గౌడ్, చిగురుమామిడి గౌడ సంఘం మండల ప్రెసిడెంట్ బొమ్మగాని వెంకటేశం గౌడ్, గౌడ సంఘ నాయకులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

అనుమతుల గందరగోళంలో విద్యార్థుల భవిష్యత్తు

విద్యాశాఖ పర్యవేక్షణ ఏది

ఫిర్యాదు ఇస్తేనే కదలికా

పిల్లల భవిష్యత్తుతో ప్రయోగాలా

యాజమాన్యంపై చర్యలు ఉంటాయా

తల్లిదండ్రులకూ కీలక సూచన

కామారెడ్డి జిల్లా ఈ క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని అసలు మండలంలో గల అభి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9, 10 తరగతుల నిర్వహణపై ఫిర్యాదులు...అధికారుల పరిశీలనలో తరగతులు కొనసాగుతున్నట్లు గుర్తింపు తరగతి గదులు సీజ్.పాఠశాల ఎదుట బీఆర్ఎస్ ధర్నా అనుమతులు లేని తరగతులపై ముందస్తు చర్యలు ఎందుకు లేవంటున్న తల్లిదండ్రులు భవిష్యత్తుతో ముడిపడిన పాఠశాలల నిర్వహణపై విద్యాశాఖ పర్యవేక్షణ ఎంతమేరకు ఉందన్న ప్రశ్నలు నసురులాబాద్‌లో తలెత్తుతున్నాయి. మండల కేంద్రంలోని అభి ఇంటర్నేషనల్ పాఠశాలలో 9, 10వ తరగతులకు అనుమతులు లేకుండానే తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావడం కలకలం రేపింది.ఫిర్యాదు నేపథ్యంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, పార్టీ నాయకులు పాఠశాలకు వెళ్లి యాజమాన్యాన్ని వివరణ కోరారు. 9, 10వ తరగతులు నిర్వహించడం లేదని ప్రిన్సిపాల్ చెప్పినట్లు నాయకులు తెలిపారు. అనంతరం ఎంఈఓ సమక్షంలో పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించగా ఆయా తరగతులు కొనసాగుతున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా సంబంధిత తరగతి గదులను సీజ్ చేసినట్లు తెలిపారు. పాఠశాలలకు ఏ తరగతి వరకు అనుమతి ఉంది? అనుమతులకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నాయా? విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారా? వంటి అంశాలపై విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రుల ఫిర్యాదు వచ్చిన తర్వాతే వ్యవహారం వెలుగులోకి రావడం విద్యాశాఖ పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. పిల్లల భవిష్యత్తుతో ప్రయోగాలా పాఠశాలలో చేరిన విద్యార్థుల చదువు మధ్యలో అనుమతులపై వివాదాలు తలెత్తితే దాని ప్రభావం చివరకు విద్యార్థులపైనే పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యాల ప్రకటనలకే పరిమితం కాకుండా, విద్యాశాఖ అధికారులు అనుమతులు, తరగతుల నిర్వహణ, ఫీజుల వసూళ్లపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. యాజమాన్యంపై చర్యలు ఉంటాయా.. అనుమతులకు విరుద్ధంగా తరగతులు నిర్వహించినట్లు అధికారుల విచారణలో తేలితే సంబంధిత పాఠశాల యాజమాన్యంపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో పాఠశాలలకు అనుమతులు, తరగతుల నిర్వహణపై విద్యాశాఖ అధికారులు స్పష్టమైన వివరాలను బహిర్గతం చేయాలని కోరుతున్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశంలో ఇకనైనా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపడతారా? లేక ఫిర్యాదులు వచ్చినప్పుడే చర్యలతో సరిపెడతారా? అన్నది వేచి చూడాలి. తల్లిదండ్రులకూ కీలక సూచన పిల్లలను పాఠశాలలో చేర్పించే ముందు ఆ పాఠశాలకు ఏ తరగతి వరకు అనుమతి ఉందో తల్లిదండ్రులు తప్పనిసరిగా నిర్ధారించుకోవాలి. పాఠశాల యాజమాన్యం చెబుతున్న సమాచారంతో పాటు సంబంధిత విద్యాశాఖ అధికారుల వద్ద వివరాలను తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

గణేశ్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరగాలి

465 మంది అదనపు పోలీసు సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు

స్టేషన్ల వారీగా నిమజ్జనాల పరిస్థితిపై సీపీ రమేశ్ సమీక్ష

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేశ్ ఆదేశించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. మంగళవారం సైబరాబాద్ కమిషనరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో పోలీస్‌స్టేషన్ల వారీగా నిమజ్జనాల పరిస్థితి, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలను ఆయన సమీక్షించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు ఎన్ని గణేశ్ విగ్రహాల నిమజ్జనం పూర్తయింది, ఇంకా ఎన్ని విగ్రహాలు నిమజ్జనం కావాల్సి ఉందనే వివరాలను సీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ, వాహనాల పార్కింగ్, మార్గాల నిర్వహణ వంటి సమస్యలపై ఆరా తీశారు. ప్రజలు, గణేశ్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన కేంద్రాల వద్ద రద్దీ నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని వెంటనే మోహరించాలని, పోలీసులు, ట్రాఫిక్ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. జీహెచ్ఎంసీతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సీపీ స్పష్టం చేశారు. తోపులాటలు చోటుచేసుకోకుండా బారికేడ్లు, పోలీసు సిబ్బంది మోహరింపు వంటి చర్యలను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు.ౌ465 మంది అదనపు సిబ్బందిౌ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఇతర జిల్లాలు, పోలీసు యూనిట్ల నుంచి రెండు దశల్లో మొత్తం 465 మంది అదనపు సిబ్బందిని రప్పించారు. తొలి దశలో 189 మంది, రెండో దశలో 276 మంది సిబ్బంది విధుల్లో చేరారు. వీరిలో ఐదుగురు ఏసీపీలు, ఆరుగురు సీఐలు/రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, 18 మంది ఎస్ఐలు/ఆర్ఎస్ఐలు, 99 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, సుమారు 250 మంది కానిస్టేబుళ్లు, 11 మంది మహిళా కానిస్టేబుళ్లు, 74 మంది హోంగార్డులు ఉన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు టీజీఎస్‌పీ, పీటీసీ వరంగల్, మల్టీ-జోన్--2 నుంచి ఈ అదనపు బలగాలను సైబరాబాద్‌కు రప్పించారు. నిమజ్జన మార్గాలు, కేంద్రాలు, ప్రధాన కూడళ్ల వద్ద వీరిని మోహరించి ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలు, ప్రజల భద్రతకు వినియోగిస్తున్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీసుల సూచనలు, ట్రాఫిక్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సీపీ కోరారు. వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని, నిమజ్జన ప్రాంతాల్లో తోపులాటలకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నారులు, వృద్ధుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని పోలీసు సిబ్బందిని సంప్రదించాలని కోరారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు సమన్వయం, అప్రమత్తత, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సీపీ రమేశ్ స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో సీఎంసీ కమిషనర్ సృజన, జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, శేరిలింగంపల్లి డీసీపీ చింతమనేని శ్రీనివాసరావు, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట నియోజకవర్గం ఇన్ ఛార్జిగా పుచ్చకాయల దేవేందర్

నియమించినట్లు ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఈడా శేషగిరి రావు



క్రైమ్ న్యూస్ , సెప్టెంబర్ 22, ఖమ్మం : మధిర పట్టణం లో జరిగిన ఆదార్ పార్టీ నిజయోకవర్గం సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా : ఈడ శేషగిరి రావు వర్దన్నపేట నిజియోకవర్గం ఇన్ చార్జిగా నియమిచినారు. అంతరం నియామక పత్రం అందజేశారు. శేషగిరిరావు ప్రసంగిస్తూ వర్ధన్నపేట రాబోయే రోజుల్లో ఆధార్ పార్టీ జెండా ఎగురవేయాలని ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలను కలుపుకొని వర్ధన్నపేట నియోజకవర్గం గెలుపు కోసం కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబోజు బుడ్డయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షులు గట్టు యుగంధర్ గౌడ్ , ఎసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు రాజారావు, ఎస్ టి సెల్ శ్రీరాష్ట్ర అధ్యక్షులు అలెం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సమగ్ర ప్రగతికి పునాది..

- దేశాన్ని ఆర్థికంగా బలంగా నిలపడంలో మహిళామణులే కీలకం..

- మహిళా సాధికారత దిశగా ముందడుగు

- అలీఫ్ సంస్థ ఆధ్వర్యంలో రొడ్డ మౌనిక సతీష్ కుమార్ అధ్యక్షతన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం ముగ్గింపు

- నవాబ్ పేటలో మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్?

రామగిరి, సెప్టెంబర్ 22(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం నవాబుపేట గ్రామంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. స్వర్గీయ శ్రీపాదరావు ఆశీస్సులతో, తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సౌజన్యంతో గత మే నెలలో అలీఫ్ సంస్థ ఆధ్వర్యంలో నవాబుపేట గ్రామ సర్పంచ్ రొడ్డ మౌనిక సతీష్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ శిక్షణను పూర్తి చేసిన మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమానికి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ హాజరై శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శిక్షణ ద్వారా పొందిన సర్టిఫికెట్లు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు ఉపయోగపడతాయని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు చొరవతో త్వరలోనే ఈ ప్రాంతంలో మహిళలకు ఉపాధి కల్పించే ప్రత్యేక పారిశ్రామిక సంస్థలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.మహిళలు ఇతరులపై ఆధారపడకుండా తమ నైపుణ్యాలను ఉపాధి మార్గాలుగా మలుచుకోవాలని, కుటుంబ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. మహిళా సాధికారత కోసం ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, నాగేపల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, ఎరుకల బాబురావు, నవాబుపేట ఉప్ప సర్పంచ్ అయిందాల లావణ్య రాజ్ కుమార్, నవాబుపేట గ్రామ శాఖ అధ్యక్షులు అయిందల కొమురయ్య, ఉపాధ్యక్షులు ఇమ్మడిశెట్టి సారయ్య, వార్డు సభ్యులు గాజుల సుధ శ్రీనివాస్, శెగర్ల తిరుపతి, కట్ట స్వరూప రవి, నవాబుపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం..

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : : వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఈనాడు కాలనీ, సుమిత్ర నగర్, బాగ్ అమీర్, బాలకృష్ణ నగర్, వెంకటేశ్వర నగర్, రిక్షాపుల్లర్స్ కాలనీ, పాపిరెడ్డి నగర్, ప్రగతి నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని సూచించారు. భక్తితో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను కలిగి ఉండటం ప్రతి ఒక్కరి ధర్మమన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల చెరువులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున పర్యావరణహితమైన మట్టి విగ్రహాలనే వినియోగించాలని గాంధీ కోరారు. చెరువులను కాలుష్యం నుంచి కాపాడుకోవడం, వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించడం సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు గాంధీ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, వినాయక మండపాల వద్ద భద్రతా చర్యలు, విద్యుత్ తదితర అంశాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించుకోవాలని మండపాల నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, భక్తులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్ న్యూ కాలనీ మార్కెట్‌లో జూట్ బ్యాగుల పంపిణీ

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

క్లాత్, జూట్ బ్యాగుల వినియోగాన్ని పెంచాలి: రవికుమార్ యాదవ్

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : మియాపూర్ న్యూ కాలనీ మార్కెట్‌లో “ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం -- పర్యావరణాన్ని కాపాడుకుందాం” అనే నినాదంతో విస్తృత అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ స్థానిక వ్యాపారులు, ప్రజలకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో సులభంగా కలిసిపోకపోవడంతో భూగర్భ జలాలు, పర్యావరణం, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. నిత్య జీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించి, జూట్, గుడ్డ సంచులను వినియోగించే అలవాటును పెంచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగుల వినియోగాన్ని తగ్గించి క్లాత్, జూట్ బ్యాగుల వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్ వ్యాపారులు కూడా వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. స్థానిక వ్యాపారులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నాగులు గౌడ్, లక్ష్మణ్, గణేష్, శివబాష, రాము, వేణుగోపాల్ రెడ్డి, పవన్ యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంటీ హిల్స్ నూతన కార్యవర్గానికి గాంధీ అభినందనలు

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను గాంధీ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ హెచ్ఎంటీ హిల్స్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని, కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని అన్నారు. కాలనీకి సంబంధించిన ఏ సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులు కాలనీ వాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గాంధీ సూచించారు. హెచ్ఎంటీ హిల్స్‌ను ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు కాలనీ వాసులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అసంపూర్తిగా ఉన్న పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. కాలనీ అసోసియేషన్ భాగస్వామ్యంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామని గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలనర్సయ్య, ఉపాధ్యక్షుడు కేఎస్ఆర్ మూర్తి, కార్యదర్శి ఎస్.గోపీచంద్, కోశాధికారి జయప్రసాద్, మేనేజింగ్ కమిటీ సభ్యులు మల్లేశ్వరచారి, చక్రపాణి, విశ్వప్రసాద్, రాజేశ్వరి, లక్ష్మీతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

బసంత్ నగర్ ముద్దుబిడ్డ కు ఢిల్లీ (కొలువు)పిలుపు.

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్ నగర్ గ్రామానికి చెందిన పరికిపండ్ల నరహరి ఐఏఎస్ మరో ఉన్నత శిఖరాన్ని అధిరోహించాడు. ప్రస్తుతం మధ్యప్రదేశ్ లో ప్రిన్సిపల్ సెక్రటరీగా సేవలందిస్తున్న ఆయనకు కేంద్ర ప్రభుత్వ భూ వనరుల విభాగం సంయుక్త కార్యదర్శిగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఉన్నత అధికార పదవుల్లో ఉన్నా కూడా తన మూలాలను మరచిపోని వ్యక్తిత్వం నరహరిని ప్రత్యేకంగా నిలబెడుతున్నది. దావఖానను ఏర్పాటు చేసి వేలాది మంది వృద్ధులకు హైదరాబాదులోని శంకరా విజన్ హాస్పిటల్లో ఆపరేషన్లు చేయించడం ద్వారా ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపారు.

విశ్వజ

నానబెట్టిన బాదం తింటే ఈ సమస్యలకు మంచి రిలీఫ్..!!

బాదం ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. బాదంలో ఉండే పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. శక్తిని అందిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ ను నిరోధిస్తుంది. బాదంలో అనేక రకాలైన విటమిన్లు లభ్యం అవుతాయి. నానబెట్టిన బాదం తినటం ద్వారా మధుమేహం నియంత్రణతో పాటుగా రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఫలితంగా దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం కలుగుతుంది. అయితే, బాదం పరిమితంగానే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బాదం ఆరోగ్య పరంగా మేలు చేస్తుంది. బాదం ఎప్పుడూ నానబెట్టిన తర్వాత, ఖాళీ కడుపుతో తినాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో నోటి లోపల చాలా ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఇది బాదంను జీర్ణం చేయడంలో, ప్రయోజనాన్ని పొందడంలో సహాయపడుతుంది. ఒక రోజులో 20 నుండి 30 గ్రాముల బాదం గింజలను తినవచ్చునని చెబుతున్నారు. బాదం పప్పు తినడం వల్ల ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ఆరోగ్యకరమైన కొవ్వు, మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్ 2, భాస్వరం, రాగి లభిస్తాయి. ఇవి మెదడు, కండరాలు, కడుపు మరియు గుండెకు ప్రయోజనకరంగా ఉంటాయి. బాదంలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి పనిచేస్తాయి. ఈ ఒత్తిడి కణాలను దెబ్బతీస్తుంది. దాదాపు అన్ని దీర్ఘకాలిక వ్యాధుల అభివృద్ధిలో పాత్ర పోషిస్తుంది. ఇది కొవ్వులో కరిగే విటమిన్, ఇది జుట్టు, చర్మం, కండరాలకు చాలా అవసరం. కణాల నిర్మాణానికి ఇది చాలా ముఖ్యమైనది. మధుమేహం నియంత్రించడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఇందులో ఫైబర్ ఉంటుంది. రక్తంలో షుగర్ లెవల్స్ ఆకస్మికంగా పెరగకుండా నిరోధిస్తుంది. రక్తపోటును నియంత్రించే మెగ్నీషియం సైతం బాదంలో పుష్కలంగా ఉంటుంది. కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కానీ బాదం కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అయితే, వైద్యులు నిర్దేశించిన మొత్తంలో నాన బెట్టిన బాదం తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

మొటిమలు మాయం

జిడ్డు చర్మం ఉన్నవారికి మొటిమలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రోజులో నాలుగైదుసార్లు చల్లటి నీటితో ముఖం శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఉదయం, సాయంత్రం రోజ్‌వాటర్‌తో ముఖం కడుక్కుంటే మొటిమల తీవ్రత తగ్గుతుంది. నూనె వంటకాలు మొటిమలకు కారణం అవుతాయి. రెగ్యులర్ డైట్‌లో నూనె శాతం తగ్గించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. నీళ్లు సమృద్ధిగా తాగాలి. రెగ్యులర్‌గా పండ్ల రసాలు తీసుకోవాలి. డిప్రెషన్‌లో ఉన్నవారికి సైతం మొటిమలు వచ్చే అవకాశం ఉందని పలు పరిశోధలు చెబుతున్నాయి. మానసికంగా సంతోషంగా ఉండాలి. సాలిసిలిక్ ఆయిల్, టీట్రీ ఆయిల్ కలిగిన ఫేస్‌వాష్‌లను ఉపయోగించడం వల్ల మొటిమలు తగ్గుముఖం పడతాయి. కలబంద జెల్‌తో కస్తూరి కలిపి ఫేస్‌ప్యాక్‌గా వేసుకున్నా మొటిమలను నియంత్రించవచ్చు.

పెసల మొలకలతో ఇలా చేస్తే..
రెట్టింపు శక్తి, ఎన్నో లాభాలు...!!

ప్రతిరోజు పెసలను నానబెట్టుకుని మొలకలు చేసుకుని తినడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పెసరలో మెగ్నీషియం, పొటాషియం స్థాయులు ఎక్కువగా ఉంటాయి. పెసర పప్పుల్లో మన శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. అంతేకాదు వీటిలో ప్రోటీయోలైటిక్ ఎంజైమ్స్ కూడా ఉంటాయి. అలసటను పోగొట్టేందుకు, మెరుగైన నిద్రకు పెసరపప్పు ఎంతగానో సహాయపడుతుంది. ఉదయం వేళ బ్రేక్ ఫాస్ట్ వేళ వీటిని తీసుకుంటే రెట్టింపు శక్తి ఇవ్వటంతో పాటుగా ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. మొలకల్లో విటమిన్‌లు, మినరల్‌లు, ఫైబర్, మరియు ప్రోటీన్‌లు అధికంగా ఉంటాయి. వీటల్లో ముఖ్యంగా విటమిన్ కాంప్లెక్స్, మరియు విటమిన్ లాంటి పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. మొలకలను తినడం ద్వారా జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. మొలకలు తేలికగా జీర్ణం అయ్యే ఆహారం కావడంతో, ఇబ్బంది లేకుండా జీర్ణమవుతాయి. మొలకల్లో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని పెంచి, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. మొలకల్లో ప్రోటీన్ చాలా శాతం లభిస్తుంది, ప్రత్యేకంగా పప్పులు, శెనగలు వంటి వాటి మొలకల్లో అధికంగా ప్రోటీన్ ఉంటుంది. ఇది మాంసాహారాన్ని తగ్గించి, ప్రోటీన్ అవసరాలను తేలికగా తీర్చగలగడం వలన, ఇది శాకాహారులకు మంచి ఆహారంగా ఉపయోగపడుతుంది. మొలకలు తక్కువ క్యాలరీలు కలిగి ఉంటాయి, కానీ పోషకాలు ఎక్కువ. మొలకల్లో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. మొలకల్లో ఉండే విటమిన్ శరీరాన్ని వింత రోగాల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించి, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మొలకల్లో ఫైబర్ మరియు పుట్టుమటుకులాంటి పోషకాలు అధికంగా ఉండటంతో, ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. ఫలితంగా, హృదయ సంబంధిత వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా, ఈ మొలకలు రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మరియు రక్తపోటు నియంత్రణలో సహాయపడతాయి. మొలకల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ కారణంగా, మొలకలు మధుమేహం ఉన్న వారికి చాలా మంచివి. వీటిని తరచుగా తీసుకోవడం ద్వారా బ్లడ్ షుగర్ లెవెల్స్ క్రమంలో ఉంటాయి. మొలకలు యాంటీ-క్యాన్సర్ లక్షణాలను కలిగి ఉంటాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ఏ చిన్న అనారోగ్యమైనా యాంటీ బయాటిక్స్
వాడుతున్నారా? ఎంత డేంజర్ అంటే



యాంటీబయాటిక్స్ .. ప్రస్తుతం మన సమాజంలో యాంటీబయాటిక్స్ వినియోగం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో యాంటీబయాటిక్స్ దుర్వినియోగం అనేక అనారోగ్య సమస్యలకు, ఆరోగ్య ప్రమాదాలకు కారణంగా మారుతుంది. సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ కొనుగోలు చేసి, వాటిని ఉపయోగించడం వల్ల వారిలో యాంటీబయాటిక్స్ రెసిస్టెన్స్ పెరుగుతుంది.

యాంటీ బయాటిక్స్ విపరీతమైన వాడకం.. ఆరోగ్య ముప్పు

ఇక గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేని ఆర్ఎంపీ వైద్యులు చిన్న చిన్న అనారోగ్యాలకు చాలా ఎక్కువ డోసేజ్ యాంటీ బయాటిక్స్ ఇస్తున్నారు. ఇది కూడా వారిలో యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ కు కారణం అవుతుంది. దీనివల్ల భవిష్యత్తులో యాంటీబయాటిక్స్ ఉపయోగిస్తే పనిచేయని పరిస్థితి చోటు చేసుకుంటుంది. ప్రజల ఆరోగ్యానికి పెరుగుతున్న అతిపెద్ద ఆందోళన.

యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ వస్తే కష్టం

యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ అనేది బాక్టీరియా మార్పులు చెందినప్పుడు, మందుల ప్రభావాలకు ఇమ్యూన్‌గా మారినప్పుడు జరుగుతుంది. దీనివల్ల ఇతరత్రా వ్యాధులు సంక్రమించిన చికిత్స చేయడం కష్టం అవుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు తక్కువగా ఉండటం వల్ల యాంటీబయాటిక్స్ తో సొంత వైద్యం చేసుకుంటున్నారు. ప్రజలు తరచుగా డాక్టర్‌ను సంప్రదించకుండా స్థానిక దుకాణాల నుండి ఈ మందులను కొనుగోలుచేసి వాడడం కారణంగా భవిష్యత్తులో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

యాంటీ బయాటిక్స్ వల్ల మనకు తెలీకుండానే సైడ్ ఎఫెక్ట్స్

యాంటీ బయాటిక్స్ దుర్వినియోగం వ్యక్తులను మాత్రమే ప్రభావితం చేయదు, ఇది ప్రజా ఆరోగ్యానికి విస్తృతమైన ప్రభావాలను కలిగి ఉంటుంది. మనకు తెలియకుండానే మన శరీరంలో వివిధ సైడ్ ఎఫెక్ట్స్ కు యాంటీబయాటిక్స్ కారణమవుతున్నాయి. అందుకే యాంటీబయాటిక్స్ ఎక్కువగా ఉపయోగించడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల వచ్చే సమస్యలను క్లిష్టంగా మారిన తర్వాత పరిష్కరించడం కష్టమవుతుంది. అందుకే యాంటీబయాటిక్స్ వినియోగం పైన, విక్రయం పై కఠినమైన నియంత్రణలు అవసరం. వైద్యులు, రోగులకు యాంటీబయాటిక్స్ తగిన విధంగా ఉపయోగించకపోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన పెంచాలి. గ్రామీణ ప్రాంతాలలో నేరుగా యాంటీబయాటిక్స్ కొనుక్కునే విధానాన్ని నియంత్రించాలి. సాధ్యమైనంతవరకు ఆరోగ్య సమస్యలను నాచురల్ గానే తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి.

మార్కెట్

ఐపీవోకి ఆర్ఎస్‌బీ రిటైల్..

రూ.1,500 కోట్ల నిధుల సేకరణలో సంస్థ

హైదరాబాద్ : ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ పేర్లతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా లిమిటెడ్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తుచేసుకున్నది కూడా. ఈ ఐపీవో ద్వారా రూ.1,500 కోట్ల వరకు నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా ఈక్విటీలను జారీ చేయడంతో రూ.500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో ప్రమోటర్లకు చెందిన 2.98 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టింది. ఇలా సేకరించిన నిధుల్లో రూ.275 కోట్లను రుణాల చెల్లింపుల కోసం, మరో రూ.118 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి వినియోగించనున్నది. ప్రస్తుతం సంస్థకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో 22 నగరాల్లో 73 స్టోర్లను నిర్వహిస్తున్నది. సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్ఎస్ బ్రదర్స్, కాంచీపురం నారాయణి సిల్క్స్, డీఏ రాయల్, వాల్యూ జోన్ హైపర్ మార్ట్ పేర్లతో అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,694 కోట్ల ఆదాయంపై రూ.104.4 కోట్ల నికర లాభాన్ని గడించింది. దేశీయ రిటైల్ రంగం అంచనాలకుమించి రాణిస్తున్నదని, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.92.6 లక్షల కోట్లుగా నమోదైంది. దీంట్లో దుస్తులు, యాక్సెసరీస్ రూ.6.90 లక్షల కోట్లుగా ఉన్నది.



ఫాస్టాగ్ వార్షిక పాస్..
తొలిరోజు 1.4 లక్షల మంది కొనుగోలు

స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తరచూ ప్రయాణించే వారికి మరింత సులభ, చౌక హైవే ప్రయాణాన్ని కల్పించేందుకు కొత్తగా ఫాస్టాగ్ వార్షిక పాసును నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ప్రవేశపెట్టిన రూ.3,000 వార్షిక హైవే టోల్ పాసు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలోని సుమారు 1,150 టోల్ ప్లాజాల్లో %ఖీూుఃుఞ్ద్ర% వార్షిక పాస్ సౌకర్యాన్ని ఎన్‌హెచ్ఏఐ విజయవంతంగా అమలు చేసింది. తొలి రోజు సాయంత్రం 7 గంటల వరకు దాదాపు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేసుకున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వెల్లడించింది. అదేవిధంగా టోల్ ప్లాజాల్లో దాదాపు 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. ఈ వార్షిక పాస్ తీసుకున్న వినియోగదారులు ఎస్ఎంఎస్ ద్వారా జీరో టోల్ మెసేజ్ అందుకుంటున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వివరించింది.

ఎవరికి వర్తిస్తుంది?

ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ వర్తిస్తుంది. ఎన్‌హెచ్ఏఐ నిర్వహించే జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలపైన టోల్ చార్జీలు చెల్లించేందుకు ఒకేసారి డబ్బు చెల్లించి ఫాస్టాగ్ వార్షిక పాసును తీసుకోవచ్చు. ఈ పథకం కింద వాహన యజమానులు ఒకేసారి రూ. 3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిపాటు ఎన్‌హెచ్ఏఐ నిర్దేశించిన జాతీయ రహదారుల్లో 200 వరకు టోల్ ప్లాజాలను దాటవచ్చు. ఒకవేళ గరిష్ఠ పరిమితి (200 టోల్ క్రాసింగ్‌లు) ఏడాదిలోపలే ముగిసిపోతే ఆటోమేటిక్‌గా సాధారణ విధానంలోకి ఫాస్టాగ్ మారిపోయి డబ్బు చెల్లించి టోల్ దాటవలసి ఉంటుంది.

పాసు ఎలా కొనాలి?

వార్షిక ఫాస్టాగ్ పాసు కొనేందుకు వాహనదారులు తమ వాహన నంబరు, ఫాస్టాగ్ ఐడీ ఉపయోగించి రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్ఏఐ/ఎంఓఆర్‌టీహెచ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాలి. తమ ఫాస్టాగ్ యాక్టివ్‌గా, సక్రమంగా ఇన్‌స్టాల్ అయి ఉందో లేదో ధ్రువీకరించుకోవాలి. యూపీఐ, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 3,000 చెల్లించాలి. ఆగస్టు 15న పాసు యాక్టివేట్ అవుతుంది. యూజర్లకు ఎస్ఎంఎస్ ద్వారా కన్ఫర్మేషన్ మెసేజ్ అందుతుంది. ఫాస్టాగ్ వార్షిక పాసు ఇతరులకు బదిలీ కాదు. రిజిస్టర్డ్ వాహనానికి మాత్రమే పనిచేస్తుంది. అంతేగాక ఈ పాస్‌ను ఒకసారి కొనుగోలు చేస్తే మళ్లీ డబ్బు వాపసు వచ్చే అవకాశం ఉండదు. పాసు ఆటోమేటిక్‌గా రెన్యూ కాదు. దాని గడువు తీరిన తర్వాత మళ్లీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

మెగాస్టార్ మూవీకి ప్రత్యేక ప్రమోషన్

మెగాస్టార్ చిరంజీవి -అనీల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా షూటింగ్ వేగంగా ముందుకు సాగుతోంది. ఆర్ఎఫ్‌సిలో షూటింగ్ సాగుతోంది. నయనతార ఇందులో హీరోయిన్‌గా నటిస్తుండగా, ఈ కాంబినేషన్ పై అభిమానుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవితో చేస్తున్న ఈ ప్రాజెక్ట్ విషయంలో అయితే ఈ ప్రమోషన్‌కి మరింత వెయిట్ కలిగింది. సినిమా షూటింగ్ దశలోనే నయనతార క్యారెక్టర్ ఇంట్రడక్షన్‌తోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ఇక తాజాగా.. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన మరో స్పెషల్ సర్ప్రైజ్ బయటకు వచ్చింది. ప్రముఖ ఛానల్ జీ తెలుగు లో ప్రసారమయ్యే ఓ ప్రత్యేక కార్యక్రమంలో చిరంజీవి ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా హాజరయ్యారు. ఈ ఎపిసోడ్ త్వరలోనే టెలికాస్ట్ కానుండగా, ఇప్పటికే రిలీజైన ప్రోమో వైరల్‌గా మారింది. అసలే బుల్లితెర ప్రేక్షకులకి చిరంజీవి ప్రత్యక్షంగా కనిపించడం అంటేనే పండుగ లాంటిది. దీంతో మెగా అభిమానులు, టీవీ వీక్షకులు ఈ ఎపిసోడ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొత్తానికి ఈ సినిమాని డిజైన్ చేయడంలో అనిల్ రావిపూడి ప్రత్యేకమైన వ్యూహంతో ముందుకెళు_న్నట్లు- తెలుస్తోంది. టార్గెటెడ్ ప్రోమోషన్ రూపంలో సినిమా మీద బజ్‌ను నెమ్మదిగా పెంచుతున్నాడు. ఇది థియేటర్‌ల వద్ద మంచి ఓపెనింగ్స్ రాబట్టేందుకు ఉపయోగపడేలా ఉన్నది.

దడక్ సీక్వెల్‌లో త్రిప్తి డిమ్రి

మరాఠిలో సూపర్ హిట్ అయిన సినిమా సైరాత్. రెండు వేరు వేరు కులాల మధ్య జరిగిన ప్రేమ కథగా వచ్చిన ఈ సూపర్ హిట్ సినిమా అనేక భాషల్లో రీమేక్ అయి హిట్ అయింది. అలా బాలీవుడ్ లోను దడక్ పేరుతో రీమేక్ చేసారు. శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో ఇషాంత్ కట్టర్ హీరో గా నటించగా ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ నిర్మించగా అజయ్, అతుల్ సంగీతం అందించారు. అలనాటి అందాల తార శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఈ సినిమాతోనే సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ- ఇచ్చింది. అయితే ఇప్పుడు ఈ సినిమాకు స్వీక్వెల్ గా ధఢక్ 2 ను వస్తోంది. అయితే తీసిందే రీమేక్ సినిమా దానికి మళ్ళీ సీక్వెల్, ఏంటో బాలీవుడ్ మేకర్స్ వెర్రి అనే కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. సరైన కథలు లేక ఇలా రీమేక్స్ తో గడిపేస్తున్నారు అని టాక్ వినిపిస్తోంది. పోనీ సీక్వెల్ ను అయినా ఫస్ట్ పార్ట్ లో నటించిన వారితో చేస్తున్నారా అంటే అది లేదు. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా యానిమల్ ఫెమ్ త్రిప్తి డిమ్రి హీరోయిన్ గా తెరకెక్కుతోంది ధఢక్ 2. అందుకు సంబందించి ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేసారు. ఈ సీక్వెల్ కు సాజిద్ ఇక్బాల్ దర్శకత్వం వహిస్తుండగా ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై కరణ్ జోహార్ నిర్మిస్తున్నాడు. జీ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 11న రిలీజ్ కానుంది. అలాగే ఈ ఏడాది ఆగస్టు 1న రిలీజ్ కాబోతుంది



సిద్దూ కొత్త సినిమా బడాస్

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తున్నారు యంగ్ హీరో సిద్దూ జొన్నలగడ్డ . తాజాగా ఆయన మరో కొత్త సినిమాను ప్రకటించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ ఆసక్తికర పోస్టర్‌ను పంచుకుంది. 'బడాస్' పేరుతో ఇది రానున్నట్లు- తెలిపింది. రవికాంత్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్-టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది 'బడాస్' విడుదల కానుంది. మీరు ఇప్పటివరకూ హీరోలను, విలన్‌లను చూసి ఉంటారు. కానీ, ఇప్పుడు వారికి మించి చూస్తారు. ఈసారి కనికరం లేకుండా ఫైర్ సెట్ చేస్తాడు అని నిర్మాణ సంస్థ ప్రకటించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నారు సిద్దూ జొన్నలగడ్డ. ఇటీవల 'జాక్' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. అయితే ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ప్రస్తుతం ఆయన 'తెలుసు కదా'లో నటిస్తున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది.

బ్యాడ్ గర్ల్ మూవీకి సెన్సార్ ఓకే

తమిళం నుంచి వస్తున్న వివాదాస్పద చిత్రం బ్యాడ్ గర్ల్. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్, కోలీవుడ్ డైరెక్టర్ వెట్రిమారన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి శివరామన్ కథానాయికగా నటిస్తుంది. వర్షా భరత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా విడుదలకు సెన్సార్ పలు అడ్డంకులు తెలిపిన విషయం తెలిసిందే. ఈ సినిమా విషయంలో సెన్సార్ బోర్డు మీదా కోర్టు వరకు కూడా వెళ్లాడు వెట్రిమారన్. అయితే ఎన్నో వివాదాలు ఎదుర్కోన్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ చెప్పిన పలు కట్‌లకు చిత్రబృందం అంగీకరించడంతో సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చింది బోర్డు. ఈ క్రమంలోనే ఈ చిత్రం విడుదలకు సిద్ధంమైంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు- చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ టీమ్ పోస్ట్ పెట్టింది. స్కూల్ స్టేజీ నుంచే తోటి విద్యార్థులలాగే తనకు ఓ బాయ్‌ఫ్రెండ్ ఉండాలనుకునే ఓ అమ్మాయి కథ ఈ చిత్రం. ఆచారాలు, కట్టుబాట్లు పాటించే కుటుంబంలో పుట్టిన ఈ అమ్మాయి తనకు నచ్చిన వాడిని ఎలా ఏంపిక చేసుకుంది. ఈ క్రమంలో ఆ అమ్మాయి జీవితంలో ఎదురైన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. ఏ గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది

నిర్మాతగానూ సక్సెస్ అందుకుంటున్న నాని

నటుడిగా మాత్రమే కాదు, నిర్మాతగా కూడా దూసుకుపోతున్నాడు నాని. నాని నిర్మించిన ప్రతీ సినిమా ఒక ప్రత్యేకతను కలిగి ఉండడంతో నిర్మాతగా ఆయన తీసే సినిమాలపై కూడా ప్రేక్షకులలో ఆసక్తి నెలకొంది. ఇటీవల 'కోర్ట్' మరియు 'హిట్ 3' వంటి సినిమాలతో నిర్మాతగా నాని భారీ విజయాలు అందుకున్నాడు. ముఖ్యంగా హిట్ ఫ్రాంఛైజీ తన ప్రొడక్షన్ హౌస్ నుంచే కొనసాగుతుండటం గమనార్హం. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు సాధించాయి. అయితే ఈ ఫేజ్‌లో నటుడిగా కన్నా నిర్మాతగా నాని ఎక్కువ సక్సెస్‌లో ఉన్నాడన్నది పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. నాని సినిమా ఎంపికలో తన టేస్ట్‌కి తగిన కథలనే సెలెక్ట్ చేస్తాడు. కథను నిర్మాతగా కాకుండా, ఒక సాధారణ ప్రేక్షకుడిగా వినడం వల్లే అతడి జడ్జ్‌మెంట్ నూరుకి నూరుపాళ్లు సక్సెస్ అవుతుంది. 'అ!' సినిమాతో నిర్మాతగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన నాని, తాజాగా హిట్ సినిమాతో తన స్థాయిని పెంచుకున్నాడు. నాని ..శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో చిరంజీవితో ఓ భారీ సినిమాను ప్రొడ్యూస్ చేయడానికి సిద్ధమవుతున్నాడు. ఇది అధికారికంగా ప్రకటించనప్పటికీ, ఇండస్ట్రీ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్ గురించి జోరుగా చర్చ నడుస్తుంది..అయితే ఈ ప్రాజెక్టు కన్నా ముందు ఒక చిన్న బడ్జెట్ సినిమా కూడా నాని నిర్మాణంలో రాబోతున్నట్టు- సమాచారం. అయితే, దాని వివరాలు ఇంకా బయటకు రాలేదు. నటుడిగా నాని ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ప్యారడైజ్' అనే సినిమా చేస్తున్నాడు. తర్వాత సుజిత్ డైరెక్షన్‌లో మరో భారీ సినిమాకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. నాని నిర్మాతగా తీసే ప్రతి ప్రాజెక్ట్‌కి తన మార్క్ టచ్ ఇవ్వడం, కాస్టింగ్ నుంచి క్రూ సెలెక్షన్ వరకు ప్రతీ స్టెప్‌లోను తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్లే ఆయన నిర్మాణంలో వస్తున్న సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వార్ 2'ఒకటి. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ (కి) ప్రధాన పాత్రల్లో నటించారు. కియారా అద్వాణీ హీరోయిన్‌గా కనిపించనున్నారు. తాజాగా ఆమె ఈ సినిమాపై పోస్ట్ పెట్టారు. ప్రపంచం దీన్ని ఎప్పుడు చూస్తుందా అని ఆసక్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు- తెలుపుతూ తారక్, హృతిక్‌లు పోస్ట్‌లు పెట్టారు. అందులో హృతిక్ పోస్ట్‌ను షేర్ చేసిన కియారా..ఈ సినిమా విషయంలో మీరెంత ఆసక్తిగా ఉన్నారో నేనూ అలానే ఉన్నాను. మీతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. ఎన్టీఆర్‌తో కలిసి అయాన్ ముఖర్జీ సృష్టించిన అద్భుతాన్ని ప్రపంచం ఎప్పుడు చూస్తుందా అని ఎదురుచూస్తున్నాను. మన టీ-మ్ మొత్తం ఈ సినిమాకు ప్రాణం పోసిందని రాసుకొచ్చారు. ఇటీవల ఈ సినిమాపై పోస్ట్ పెట్టిన ఎన్టీఆర్.. హృతిక్ ఎనర్జీ తననెంతో ఆకర్షించిందని తెలిపారు. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు- చెప్పారు.

బీచ్‌లో హాట్‌గా, స్టైలిష్‌గా డీజే టిల్లు భామ..

ఇంతకీ డీజే టిల్లు సినిమాలో రాధికా పాత్రతో సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసింది నేహా శెట్టి. ఈ సినిమాతో సూపర్ పాపులారిటీ సంపాదించుకున్న నేహాశెట్టి చివరగా విశ్వక్ సేన్ నటించిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి చిత్రంలో నటించింది. కాగా ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌ను పక్కన పెట్టేసి సరదాగా షికారు చేసే పనిలో పడింది టిల్లు భామ. సముద్ర తీరంలో విహరిస్తూ బీచ్ అందాలను ఆస్వాదిస్తూ సేద తీరుతుంది. ఇంతకీ ఈ బ్యూటీ ఎక్కడికెళ్లిందనే కదా మీ డౌటు. ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రదేశం మాల్దీవులకు వెళ్లింది నేహాశెట్టి. బీచ్‌లో బికినీలో ఓ వైపు ఎంజాయ్ చేస్తూనే.. మరోవైపు స్టైలిష్ అవుట్‌ఫిట్స్‌లో మెరిసింది. ఇప్పుడీ స్టిల్స్, వీడియోలు నెట్టింట రౌండప్ చేస్తూ కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి తర్వాత మరే సినిమాకు సైన్ చేయలేదు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056